
కొత్తగా ప్రారంభించనున్న ఇబ్రహీంపేట నూతన ఇసుక రీచ్ ప్రాంతం

ఇసుక.. కష్టాలు తీరేలా!

- ఏలూరు జిల్లాలో ప్రాథమికంగా ఐదు కొత్త రీచ్‌ల గుర్తింపు
- మార్చి నెలాఖరుకు అందుబాటులోకి..
- మూడు నెలలకు 3.58 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత

(ఏలూరు-ఆంధ్రజ్యోతి):

వేసవిలో నిర్మాణాలు జోరుగా సాగడంతో ఇసుకకు భారీ డిమాండ్ ఉంటుంది. ప్రజల అవసరాలకు దీటుగా ఇసుక రీచ్‌లను అన్ని వర్గాలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఓపెన్ ఇసుక రీచ్‌లే శరణ్యం. గృహ నిర్మాణాలు, వివిధ ప్రాజెక్టులు, ప్రభుత్వ పథకాల కోసం ఇసుకను మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఓపెన్ రీచ్‌ల కోసం మైనింగ్, ఇరిగేషన్, ఇతర శాఖల అధికారులు వేట మొదలెట్టారు. ఎన్నికల కోడ్ ముగియగానే అధికారంగా రీచ్‌లను తెరవనున్నారు.

- గోదావరి నది పరీవాహక ప్రాంతంలోని కుక్కునూరు మండలంలోని ఇబ్రహీంపేట, దాచారం, వింజరం, వేలేరుపాడు మండలంలో రుద్రమకోట-1, 2 పాయింట్లను కలిపి మొత్తం ఐదు ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆధ్వర్యంలో మైనింగ్ అధికారులు, గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంట్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు ఇసుక రీచ్‌లకు సాంకేతిక మంజూరు కోసం విజయవాడలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు నివేదించారు. అక్కడి నుంచి క్లియరెన్సు రాగానే డీఎల్ఎస్ (జిల్లా స్థాయి ఇసుక) కమిటీ సమావేశంలో ధరలు నిర్ణయించనున్నారు. అన్నీ సవ్యంగా సాగితే ఈ ఐదు రీచ్‌ల నుంచి మొత్తం 3.58 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉంటుందని అంచనా. మార్చి 25 తర్వాత ఇవి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.
- నెల రోజుల క్రితం నుంచి పోలవరం మండలం పట్టిసీమ డీ సిల్టేషన్ (నది లోపల పేరుకున్న) ఇసుక పాయింట్ నుంచి ప్రజలకు ఇసుక అందుబాటులోకి తీసుకొచ్చారు. గూటాల-1 గూటాల-2 పాత ఇసుక రీచ్‌లకు సమీపంలో గుర్తించిన ప్రాంతంలో బోట్స్‌మెన్ సొసైటీల ద్వారా ఇసుకను బయటకు తీసి అక్కడ నుంచి అమ్మకాలు చేశారు. ఇది జిల్లాలోని పలు ప్రాంతాలకు చేరువగా ఉంది. అధికారుల అంచనాల ప్రకారం నెలకు సరిపడా నిల్వల మేరకు అక్కడే ఇసుకను తీశారు.

జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఒక టన్నుకు ధరను రూ.165గా డిసిల్టేషన్ చార్జీగా నిర్ణయించగా, అడ్మినిస్ట్రేషన్, జీఎస్టీ తదితర చార్జీలను కలుపుకుని వినియోగదారునికి రూ.221కు అందించారు. మూడు డిపోల ద్వారా వచ్చే ఇసుకను మార్చి నెలాఖరు వరకు వాడతారు. ఆ తర్వాత కొత్త రీచ్‌లతో ఏప్రిల్, మే, జూన్ నెలలకు ఇసుక నిల్వలు సిద్ధం చేస్తారు. దీంతో జిల్లా అవసరాలకు ఇసుకను మరింత అందుబాటులో ఉంచనుండడంతో అన్ని రకాల నిర్మాణాలు ఊపందుకోనున్నాయి.

ఇసుక డిపోలే ఆధారం

ఉమ్మడి జిల్లాలో 16 ఇసుక రీచ్‌లతో ఇసుక దండిగా లభించేది. జిల్లాల విభజనతో ఇప్పుడు పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలకు ఆ ఇసుక రీచ్‌లన్నీ వెళ్లిపోయాయి. దీంతో జిల్లా అవసరాల కోసం వేట ప్రారంభించాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వంలో నూతన ఇసుక విధానం అమలు చేయడంతో ఇబ్రహీంపేట, వింజరం, చేబ్రోలు డిపోల నుంచి ఉచిత ఇసుకను జిల్లా అవసరాలకు వాడారు. ఇసుకలో మట్టి కలిసి ఉండడం వల్ల చేబ్రోలు డిపో నుంచి ఇసుకను తీసుకోవడం లేదు. వింజరం వద్ద ఇంకా 1,190 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. ఇబ్రహీం పట్నం వద్ద నిల్వలున్నాయి. ఈ మూడు డిపోల ద్వారా ఇప్పటి వరకు 50,299 మెట్రిక్ టన్నుల ఇసుకను పలు అవసరాలకు తరలించారు.

జలం..మితం!



జలాశయాల్లో పడిపోతున్న నీటిమట్టాలు

వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు అనూహ్యంగా పెరుగుతున్నాయి. ఇప్పటికే వివిధ మండలాల్లో సాగు, తాగునీటి అవసరాలు పెరిగాయి. మెట్ట ప్రాంతంలోని ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలు కొన్నిచోట్ల తగ్గుముఖం పట్టగా, మరికొన్నిచోట్ల నిలకడగా కనిపిస్తోంది. రెండో పంటకు ఆధారమైన ఈ జలాశయాల్లో నీటి మట్టం క్రమేపీ పడిపోతే పంటలకు నష్టమేనన్న ఆందోళన లేకపోలేదు.


(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

మెట్ట ప్రాంతంలో రెండో పంటకు అనువుగా జలాశయాల మీదే రైతులు ఆధారపడ్డారు. తాగునీటి అవసరాలకు ఇవే జలాధారం. ముఖ్య జలాశయాలతోపాటు చిన్న చిన్న నీటి కుంటల్లోను ఇప్పటికే నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గుముఖం పట్టింది. మెట్ట ప్రాంతానికి ఆధారంగా ఎర్రకాల్వ, కొవ్వాడ, జల్లేరు, తమ్మిలేరు రిజర్వాయర్లు ఉన్నాయి. వీటి ద్వారా లభించే నీరుతోనే రెండో పంటగా వరితో పాటు మొక్కజొన్న పండించి రైతులు కాస్తో కూస్తో లబ్ధి పొందుతున్నారు. కాని గతంతో పోలిస్తే ఈసారి ఎర్రకాల్వ, జల్లేరు జలాశయాల్లో నీటి మట్టం తగ్గుముఖం పట్టింది. గత వర్షాకాల సీజన్‌లో అనుకున్నంత వానలు పడకపోవడం, కొండ ప్రాంతాల నుంచి వచ్చే నీరు తగ్గు ముఖం పట్టడంతో జలాశయాల్లో నీటి మట్టం ఫిబ్రవరి నాటికే తగ్గుతూ వస్తోంది.


- జల్లేరు జలాశయంలో గతంకంటే ఇప్పుడు దాదాపు రెండు మీటర్లు నీరు తగ్గిపోయింది. ఈ జలాశయంకు కొండ వాగులే ప్రధాన ఆధారం. ఖమ్మం తదితర ప్రాంతాల నుంచి వచ్చే నీరంతా జల్లేరుకు, ఆ తర్వాత ఎర్రకాల్వకు చేరుతుంది. ఈ పరిస్థితుల్లో జల్లేరులో గతంకంటే నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వేసవి ఎండలు ముదిరే నాటికి మరింతగా నీటి సామర్థ్యం క్షీణించే అవకాశం లేకపోలేదు.
- జంగారెడ్డిగూడెం సమీపాన ఉన్న ఎర్రకాల్వ ప్రధాన జలాశయంలో నీటి సామర్థ్యం క్రమేపీ క్షీణిస్తోంది. గతేడాది కంటే కాస్తంత తక్కువగానే నీటిమట్టం తగ్గుముఖం పట్టినా రాబోయే మూడు వారాల్లో నీటి వినియోగం అత్యధికంగా ఉండబోతున్నందున ఇక్కడ నీరు అడుగంటబోతోంది. ఎర్రకాల్వ వంటి జలాశయం నుంచి తాగు, సాగునీటి అవసరాలకు వినియోగించుకోవాల్సి ఉండగా వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని వినియోగం అత్యధికంగానే ఉండబోతుంది.
- తమ్మిలేరు జలాశయంలో నీటి మట్టం ఇప్పటికి 1.5 టీఎంసీలు కనిపిస్తోంది. గతంలో ఇదే సమ యంలో కేవలం ఒక టీఎంసీ మాత్రమే నీటి నిల్వ నమోదైంది. కాని ఈసారి తెలంగాణ ప్రాంతం లో వర్షపాతం అత్యధికంగా ఉండ డంతో ఆ మేరకు బేతుపల్లి చెరువు నుంచి వరద నీరు తమ్మిలేరులోకి చేరడంతో నీటి నిల్వ సామర్థ్యం ఇప్పటికీ సంతృప్తి కరంగానే ఉంది. దీంతోపాటు కొవ్వాడ రిజర్వాయరులోను ఇప్పటికి నీటి నిల్వ సంతృప్తికరమే.

మీటర్లలో..	పూర్తి నీటి నిల్వ సామర్థ్యం	ప్రస్తుత నీటిమట్టం	గతేడాది ఇదే సమయంలో..
ఎర్రకాల్వ	83.50	81.68	82.12
జల్లేరు	217.5	211	213
కొవ్వాడ	90.50	85	83
తమ్మిలేరు	3 టీఎంసీ	1.5 టీఎంసీ	1.0 టీఎంసీ

- ఫిబ్రవరిలోనే అనూహ్య పరిణామాలు
- పెరుగుతున్న ఉష్ణోగ్రతే కారణం
- రెండో పంట గట్టెక్కేనా..?
- తాగునీటి అవసరాలకు అడ్డంకులు
- అప్రమత్తం కాకుంటే తప్పని ఇక్కట్లు


ఎర్రకాల్వ జలాశయం


కొవ్వాడ జలాశయం


తమ్మిలేరు జలాశయం

జాగ్రత్త పడాల్సిందే

మెట్ట ప్రాంతంలో ప్రధాన జల వనరులు లభించే రిజర్వాయర్లన్నింటిలోను నీటి మట్టం కాస్త అటుఇటుగానే కనిపిస్తోంది. ఇప్పటికే పగటి ఉష్ణోగ్రత 36 సెల్సియస్‌కు చేరింది. గతేడాదితో పోలిస్తే రెండు డిగ్రీలు ఎక్కువే. ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే తాగు, సాగునీటి అవసరాలు రెట్టింపు కానున్నాయి. ఇప్పటికిప్పుడు నీటి వృథాను దగ్గరుండి మరీ అరికట్టి ఆ మేరకు అవసరాల నిమిత్తమే నీటిని వినియోగిస్తేనే తప్ప నీటి కొరతను ఎదురు కానీయకుండా చూడొచ్చు. గతేడాది మార్చి మూడో వారం దాటిన తర్వాత తగ్గుముఖం పడుతూ వచ్చిన నీటి నిల్వలు ఏప్రిల్ రెండో వారం నాటికే ఆసాంతం ఆవిరి అయ్యాయి. ఈసారి ఏడాది ఎండ తీవ్రత దృష్ట్యా ఆ పరిస్థితే ఉండబోతుందన్న అంచనాకు వచ్చారు. అధికారులు ఇప్పటి నుంచే జాగ్ర త్తలు తీసుకోకుంటే పశువులకు తాగునీటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలతో పాటు భూగర్భ జలమట్టం క్షీణించి తాగునీటి కటకట ఎదురు కావచ్చనేది స్థానికుల వాదనగా వినిపిస్తోంది.


పవర్‌పేట రైల్వే స్టేషన్ వద్ద రిజర్వేషన్ కోసం వేచి ఉన్న ప్రయాణికులు

పవర్‌పేట రైల్వే స్టేషన్‌లో ఏజెంట్లదే పవర్

- రిజర్వేషన్ టిక్కెట్లు సామాన్యులకు అందడం గగనమే
- రైల్వే సిబ్బందిని ప్రసన్నం చేసుకుంటున్న ఏజెంట్లు !
- సీసీ కెమెరాలు లేకపోవడంతో ఇష్టారాజ్యం
- అధికారుల తీరుపై ప్రయాణికుల విస్మయం

7

మునిసిపల్ కమిషనర్లంతా ఆరు గంటలకే వీధుల్లో ఉండాలి



పారిశుధ్యం, తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలి : ఆర్డీ ఆదేశం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కమిషనర్లంతా ఉదయం ఆరు గంటలకే వీధుల్లోకి వచ్చి పారిశుధ్య పనులు, ఇంటింటికి తాగు నీటి సరఫరా పనులు, ఆస్తిపన్ను వసూళ్ల పరిశీలిం చాలని మునిసిపల్ ఆర్డీ నాగనరసింహారావు ఆదేశిం చారు. గోకుల్ కల్యాణ మండపంలో జిల్లాలోని ముని సిపల్ కమిషనర్లు సెక్షన్ హెడ్‌లు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమీక్షాసమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగుస్తున్నందున ఆస్తి, కుళాయి, ఇతర పన్నుల వసూళ్లను ఉధృతం చేయాల న్నారు. నూరుశాతం పన్నులు వసూలు చేసి నగరం, పట్టణాలబివృద్ధికి తోడ్పడాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసేవరకు అత్యవసరమైతే తప్ప సెలవులు పెట్టకుండా విధులు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణ లో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ఏటా మార్చిలో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు వడ్డీ రద్దు ఉంటుందని కానీ ఈ ఏడాది వడ్డీ రద్దు ఉండదని స్పష్టం చేశారు. ప్రతీ ఇంట్లోను తడి, పొడిచెత్త వేరు చేసి మునిసిపల్ సిబ్బందికి అందించాల న్నారు. తడిచెత్తతో ఎరువును ఆ ఇంటివారే తయారు చేసుకోవాలని, ఎలా తయారు చేసుకోవాలో తెలపడానికి మెప్మా సిబ్బంది, ఎన్జీవోల సహకారం తీసుకుంటున్నామన్నారు. అన్న క్యాంటీన్స్‌లో ఆహారం మంచిగా అందుతుందో లేదో కమిషనర్ పరిశీలించాలన్నారు.

వీధి కుక్కలను పట్టుకుని పిల్లలు పుట్టకుండా ఆపరేషన్లు చేయించాలన్నారు. చెత్తపన్ను రద్దు చేశామని ఎవరైనా సిబ్బంది చెత్తపన్ను అడిగితే తమకు తెలపాలన్నారు. కమిషనర్ ఎ.భానుప్రతాప్, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజి వీడు కమిషనర్లు వెంకటరమణ, పావని, వెంకటరామిరెడ్డి, ఏలూరు అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ నెలాఖరులోగా.. వీధి కుక్కలకు కు.ని. శస్త్రచికిత్సలు : కలెక్టర్



ఏలూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):జిల్లాలో నాలుగు మునిసిపాలిటీల పరిధిలోని వీధి కుక్కలకు యాంటీరాబీస్ వ్యాక్సిన్, బర్త్ కంట్రోల్ శస్త్ర చికిత్సలను ఏప్రిల్ నెలాఖరుకు పూర్తి చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి కమిషనర్లను ఆదేశిం చారు. కలెక్టరేట్‌లో పురపాలక శాఖ అంశాలపై ఆమె కమిషనర్లతో శుక్రవారం సమీక్షించారు. మునిసిపాలిటీల పరిధిలో 2,400 వీధి కుక్కలను గుర్తించగా గత 45 రోజుల్లో 590 కుక్కలకు రాబిస్ వ్యాక్సిన్, కు.ని శస్త్రచికిత్సలు చేసినట్టు తెలి పారు. మిగిలిన లక్ష్యాన్ని ఏప్రిల్ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్యలు లేకుండా కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలన్నారు. అన్న క్యాంటీలను తనిఖీలు చేయాలని, పారిశుధ్య కార్మికులు ఉదయం ఐదు గంటలకల్లా విధుల్లోకి వెళ్లేలా పర్యవేక్షించాలన్నారు. చిన్నారుల ఆధార్ నమోదుపై ఆరా తీశారు. ఏలూరు, నూజివీడు, చింతలపూడి జంగారెడ్డిగూడెం కమిషనర్లు అన్నాప్రగడ భానుప్రతాప్, ఆర్.వెంకటరామిరెడ్డి, డి.పావని, కేవీ రమణ పాల్గొన్నారు.



జాలిపూడి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి) : ఏలూరు రూరల్ మండలం జాలిపూడి పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీలో నిధులు పక్కదారి పట్టడంతో పాటు సుమారు రూ.22 లక్షల మేర దుర్వినియోగం తదితర ఆరోపణలపై ఇటీవల డీఎల్‌పీవో విచారణ నిర్వహించారు. నిధులు దుర్వినియోగం జరిగినట్టు నిర్ధారించి డీపీవోకు నివేదికను అందజేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిధులు దుర్వినియోగంలో సర్పంచ్ వి.బి నవ్య చెక్ పవర్‌ను ఇటీవల రద్దు చేశారు. అయితే తనకు ఎటువంటి నోటీస్ ఇవ్వకుండా చెక్ పవర్‌ను రద్దు చేశారంటూ హైకోర్టును ఆశ్రయించడంతో చెక్ పవర్‌ను పంచాయతీ అధికారులు పునరుద్ధరించారు. కాగా చెక్ పవర్ ఇచ్చిన వెంటనే నిధులు దుర్వినియోగం వ్యవహారంలో మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీస్ ఇవ్వడం విశేషం.

డీఎస్‌వో సత్యనారాయణరాజు బదిలీ


డీఎస్‌వో సత్యనారాయణరాజును సత్కరిస్తున్న జిల్లా చౌక డిపో డీలర్స్ అసోసియేషన్ నాయకులు

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా పౌరసరఫరాల శాఖాధికారిగా పని చేస్తున్న (డీఎస్‌వో) ఆర్ఎస్ సత్యనారాయణరాజును కాకినాడ జిల్లాకు బదిలీ చేస్తూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఏఎస్‌వోగా పని చేస్తున్న ప్రతాప్‌రెడ్డికి డీఎస్‌వో ఎఫ్ఏసీ బాధ్యతలను అప్పగించారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ బదిలీ చేసినట్టు చెబుతున్నారు. కాగా డీఎస్‌వోగా విధులు నిర్వహించిన ఆర్ఎస్ సత్యనారాయణరాజు బదిలీపై కాకినాడ జిల్లాకు వెళుతున్న సందర్భంగా జిల్లా చౌకడిపో డీలర్స్ అసోసియేషన్ నాయకులు ఆయనను శుక్రవారం ఏలూరులో కలిసి అభినందనలు తెలిపారు. డీఎస్‌వోగా ఎఫ్ఏసీ బాధ్యతలు స్వీకరించనున్న ప్రతాప్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చౌకడిపో అసోసియేషన్ నాయకులు ఎ.ఉదయ భాస్కరరావు, ఉంగుటూరు మండల చౌకడిపో డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అడపా మాణిక్యాల రావు, కార్యదర్శి జి.సూరిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి వీసీహెచ్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



సమస్యల సుడిలో తాడేపల్లిగూడెం బస్టాండ్

తాడేపల్లిగూడెం రూరల్ : నిత్యం రద్దీగా ఉండే తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపోను సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రయాణికులు తాగేందుకు తాగునీరు, సరైన మరుగు దొడ్లు లేవు. దీనికి తోడు పరిసరాలన్నీ ఖాళీ వాటర్ బాటిల్స్ , చెత్తచెదారాలతో పేరుకుపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వీటన్నింటికంటే ముఖ్యంగా వేసవి వేడికి ప్రయాణికులు వెయిట్ చేసేందుకు వెయిటింగ్ హాల్‌లో ఫ్యాన్‌లు పనిచేయక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



డిపో ఆవరణలో ప్లాస్టిక్ బాటిల్స్



ఆవరణలో పేరుకున్న చెత్త

ఫ్యాన్‌లు బాగు చేయించాలి



మా ప్రాంతం వెళ్లే బస్సుల కోసం గంటకుపైగానే ఎదురు చూడాలి. వెయిటింగ్ ఏరియాలో ఫ్యాన్‌లు లేక ఇబ్బంది పడుతున్నాం. దీనికి తోడు చెత్త చెదారాలతో ఆవరణ దుర్గంధం వెదజల్లుతోంది. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఫ్యాన్లు బాగు చేయించాల్సి ఉంది.

మనోజ్, ప్రయాణికుడు, జంగారెడ్డిగూడెం



పాలకొల్లులో సౌకర్యాల లేమి

పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు బస్టాండ్‌లో సుమారు 80 మంది ప్రయాణికులు వేచి ఉండేందుకు సీట్లు ఉన్నాయి, తాగునీటి సౌకర్యం ఉన్నప్పటికీ ప్రయాణికులు అధికంగా వాటర్ బాటిల్స్ వినియోగిస్తున్నారు. ఇక టాయ్‌లెట్ల విషయంలో ప్రతీ రోజూ క్లీనింగ్ చేస్తున్నారు. బస్టాండ్ ఏరియా పరిశుభ్రంగా లేకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కుక్కలు విచ్చల విడిగా తిరుగుతున్నాయి. వాహనాల పార్కింగ్‌కు మాత్రం ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సైకిల్ స్టాండ్‌లో పార్కు చేసిన బైక్‌లు, సైకిళ్ళకు టోకెన్లు ఇస్తారు. కానీ దాని మీద ధర ఉండదు. ఒక్కొక్కరికి ఒక్కో విధంగా వసూలు చేస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు

పార్కింగ్‌కు అదనపు స్థలం ఏర్పాటు చేయాలి



నిత్యం వేలాది మంది ప్రయాణం చేస్తూంటారు. ఇటీవల లగేజ్ బుకింగ్ కూడా పెరిగింది. బస్టాండ్ ఆవరణలో వేసవిని దృష్టిలో పెట్టుకుని మరిన్ని ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి. వాహనాల పార్కింగ్‌కు కొంత స్థలం ఏర్పాటు చేయాలి. జేబు దొంగతనాలు జరుగుతున్నాయి.

-గుడిశా ప్రసాద్, ప్రయాణికుడు, పాలకొల్లు

తణుకులో అపరిశుభ్ర తాగునీరే దిక్కు



తణుకు : తణుకు బస్టాండ్‌లో అపరిశుభ్ర నీరే దిక్కు. స్లాబ్ పైన ఉన్న వాటర్ ట్యాంకు నుంచి వచ్చే నీరు మాత్రమే తాగునీరు. కుళాయిలు కూడా నాచు పట్టి ఉన్నాయి.భోజనాలు చేసిన తర్వాత అక్కడ కడగడంతో ఆహార వ్యర్థాలు నిలిచిపోతున్నాయి. బస్టాండ్ ఆవరణలో ఉన్న మూత్ర శాల తీవ్ర దుర్వాసన వస్తుంది. అక్కడ నీటి సౌకర్యం లేదు. వేసవి కాలం వస్తున్నప్పటికి కనీసం ఫ్యాన్లు కూడా వేయడం లేదు. ఉన్న ఫ్యాన్లు అలంకార ప్రాయంగా ఉన్నాయి. క్యాంటీన్‌లో వ్యర్థాలు డ్రెయిన్లలో వేయడంతో డ్రెయిన్ పారుదల లేక పోవడంతో దుర్వాసన వస్తున్నది.

ఆర్టీసీ ప్రయాణం అంటే సురక్షితం.. సుఖవంతమని భావిస్తూ ఉంటారు. ఎక్కువ శాతం మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి ఇష్టపడతారు. అయితే చాలా బస్టాండ్లలో సౌకర్యాలు తూతూ మంత్రంగానే కల్పిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్‌స్టేషన్లలో అవసరమైన తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునేందుకు కుర్చీలు, ఫ్యాన్లు వంటివి ఏర్పాటు చేయాలి. వివిధ బస్టాండ్లలో నిర్వహణ లేక అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతోనే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లోని బస్టాండ్లలో పరిస్థితిపై ఆంధ్రజ్యోతి పరిశీలన...

- ఏలూరు /భీమవరం /ఆకివీడు/నరసాపురం/ తాడేపల్లిగూడెం/తణుకు/పాలకొల్లు /ద్వారకాతిరుమల/పెనుగొండ

ఆంధ్రజ్యోతి పరిశీలన



ఏలూరు బస్‌స్టేషన్

సమస్యల స్టాండ్



నీటి సౌకర్యం లేని మూత్రశాల

మూత్రశాలలో నీటి సౌకర్యం లేదు

మూత్రశాల్లో నీటి సౌకర్యం లేదు. దీంతో అక్కడ మూత్రం పోయాలంటే భయం వేస్తుంది. అందు లోకి వెళ్లాలంటే ముక్కు మూసుకోవాలి. వేరే సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. అక్కడ నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి. ఫ్యాన్‌లు బాగుచేయించి, మంచినీరు ఏర్పాటు చేయాలి.

- జనార్దన్, ప్రయాణికుడు, తాడేపల్లిగూడెం

మూతపడిన స్వచ్ఛభారత్ టాయిలెట్స్



నరసాపురం : ఆధునిక హంగులతో నిర్మించిన బస్టాండ్‌లో ప్రయాణికులు టాయిలెట్స్‌కి వెళ్లాలంటే పది రూపాయిలు జేబులో పెట్టుకోవాల్సిన పరిస్థితి. మార్కెట్ సమీపంలోనే బస్టాండ్ ఉంది. దీంతో మరో చోటికి వెళ్లే అవకాశం లేకపోవడంతో ప్రయాణికులు అత్యవసర సమయాల్లో అడిగినంత చెల్లించి టాయిలెట్స్‌కి వెళ్లతున్నారు. ప్రాంగణం లోనే స్వచ్ఛభారత్‌కి సంబంధించిన తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అయితే వీటి నిర్వహణ లేకపోవడంతో మూసివేశారు. దీంతో బస్టాండ్‌లో పాటదారుడు నిర్వహించే టాయిలెట్స్‌కే వెళ్లాల్సిన పరిస్థితి. రోజుకి 80 బస్సులకు పైగా ఇక్కడ నుంచి రాకపోకలు సాగిస్తుండగా 1500 మంది రాకపోకలు సాగిస్తున్నారు.

పెనుగొండలో టాయిలెట్స్ శిథిలం

పెనుగొండ : పెనుగొండలో టాయిలెట్స్ శిథిలమయ్యాయి. టాయిలెట్స్‌కు అడ్డంగా వాహనాలు నిలపడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టాయిలెట్స్‌కు వెళ్లే దారి కూడా సరిగాలేదని విమర్శిస్తున్నారు. దోమలతో ఇబ్బందులు పడుతున్నారని ఆ సమయానికి ఫ్యాన్‌లు కూడా పంచాయతీ వారి అనుమతి లేకుండా వేయడం కుదరదని వాపోతున్నారు. వేసవి కాలం దృష్ట్యా తాగునీటి సరఫరా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

బస్టాండ్‌లలో సౌకర్యాల కొరత

ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

ప్రధానంగా టాయిలెట్ల నిర్వహణ అధ్వానం

అపరిశుభ్ర పరిస్థితులు..తాగునీటికి ఇక్కట్లు





కట్టారు.. నిరుపయోగంగా మార్చారు

భీమవరం టౌన్ : ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లో ఇన్ గేటుకు సమీపంలో, అవుట్ గేటు సమీపంలో నిర్మించిన మరుగు దొడ్లు నిరుపయోగంగా మారాయి.మురుగు బయటకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడం, నిర్వహణ లేకపోవడంతో దారుణంగా ఉన్నాయి. అవుట్ గేటు వద్ద ఉన్న మరుగుదొడ్డి వద్ద పిచ్చి మొక్కలు పెరిగాయి.వర్షం వస్తే వెళ్లే పరిస్థితి ఉండదు. కుర్చీలకు మరమ్మతులు చేసి రంగులువేసి ఉంచారు. ఫ్యాన్‌లను ఏర్పాటు చేశారు. మంచినీటి సౌకర్యం మెరుగు పర్చాల్సి ఉంది.

ఆదాయం వస్తున్నా..సౌకర్యాలు అంతంతే





ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో నిత్యం రద్దీగా ఉండే ద్వారకాతిరుమల బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. ఇక్కడి బస్టాండ్‌ను నిత్యం వేలాది మంది ప్రయాణికులు సంచరిస్తున్నా తగిన సౌకర్యాలు లేవు. ఇప్పటి వరకూ సరైన కుర్చీలు లేవు.. మంచినీటి సౌకర్యం కరువైంది. కుళాయిలున్నా మంచినీరు వాసన వస్తుందని ఎవరూ తాగడం లేదు. చిన్నట్యాంక్ ఉన్నప్పటికీ దానిని శుభ్రపరిచి ఏళ్ల దాటినట్లు దానిపైనే ఉంది. బయట ఉన్న కుళాయిలకు ట్యాప్‌లు కూడా లేవు. ఈ బస్టాండ్‌కు మంచినీటి సౌకర్యానికి పంచాయితీ కనెక్షన్ ఉంది. అయితే తాగేందుకు, మరుగుదొడ్లకు, ఇతర వాడకానికి ఆ నీరు సరిపోవడం లేదని నూతనంగా బోరు వేశారు. ట్యాంక్‌ల శుభ్రత లేకపోవడంతో ఎవరూ ఇక్కడ మంచినీరు తాగడంలేదని చెబుతున్నారు. బస్టాండ్ ఆవరణలో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది.

పేరుకే కొత్త బస్టాండ్.. సౌకర్యాలు శూన్యం



మరుగుదొడ్ల దుస్థితి



ఏలూరు క్రైం : జిల్లా కేంద్రమైన ఏలూరు కొత్త బస్టాండ్‌లో పరిస్థితులు పరిశీలిస్తే అందరూ ముక్కు మీద వేలేసుకోవాల్సిందే. అసలు ఇక్కడ ఆర్టీసీ అధికారులు ఉన్నారా ? లేరా అనే ప్రశ్నలు తలెత్తక మానవు.బాత్‌రూమ్‌ల పరిస్థితి దారుణంగా ఉంది. మూత్ర విసర్జన వెళ్లాలంటే కనీసం నీళ్ళు పోయడానికి కూడా నీరు అందుబాటులో లేవు. యూజర్ ఛార్జీలు మాత్రం వసూలు చేస్తున్నారు. బస్టాండ్‌లో ఉన్న పార్కింగ్‌లో ధరల పట్టికలు లేనేలేవు. మోటారు సైకిల్‌కు రూ.పది , కారుకు 50, ఆటోకు 15 వసూలు చేయాల్సి ఉండగా ఇక్కడ మాత్రం రోజుకు మోటారు సైకిల్‌కు రూ.40, కారుకు 200, ఆటోకు 150 అడ్డంగా వసూలు చేసుకుంటున్నారు. వాహనాలు ఎండలోనే ఉంటాయి. బస్టాండ్లలో ఉన్న షాపుల్లో ఎమ్మార్పీ కంటే ఐదు నుంచి నుంచి 10 రూపాయల అదనంగా వసూలు చేస్తున్నారు. ఎవరైనా అడిగితే గొడవలకు దిగుతున్నారు. ఆర్టీసీ అధికారులు అయితే షాపుల వల్ల ఆదాయం వస్తుందని ఆలోచనతో ఉన్నారే తప్ప నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా లేదా అని పరిశీలన చేసిన దాఖలాలు లేవు.





వాష్‌రూంకి వెళ్లే దారి ఇలా.. వాహనాలకు బరకాలతో రక్షణ..

ఆర్టీసీ బస్టాండా.. పార్కింగ్ స్టాండా ?



ఆకివీడు : ఆకివీడులో ఆర్టీసీ కొత్త బస్టాండ్‌కు కంట్రోలర్ లేకపోవడంతో ఇష్టానుసారంగా నడుస్తుంది. కార్లు పార్కింగ్ చేయడం, యువకులు క్రికెట్ ఆడుతుండడంతో బస్సులు నడపడానికి డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ పాయింట్‌లోకి రాకుండా దూరంగా ఆపి వేగంగా వెళ్లిపోతుండడంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు.తాగడానికి మంచినీరు సౌకర్యం లేదు. రాత్రిళ్ల దీపాలు వెలగపోవడంతో మందుబాబులకు నిలయంగా మారింది. బస్టాండ్ వెనుక డ్రైనేజీ ఆక్రమణలకు గురై పూడుకుపోయి పారుదల క్షీణించింది. దుర్వాసనకు బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చోలేకపోతున్నామంటున్నారు.

కావాల్సిన చోట బస్సులు నడపరు..



కావాల్సిన చోట బస్సులు నడపరు.. అక్కర్లేని చోట్ల నడుపుతున్నారు. ఆకివీడు ఆర్టీసీ కొత్త బస్టాండ్‌లో కంట్రోలర్ లేకపోవడంతో ఇష్టానుసారంగా నడుస్తుంది. బస్టాండ్ ప్రాంగణంలో వాహనాలు పెట్టడం, యువకులు ఆటలాడడంతో ఆర్టీసీ డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్ల మందుబాబులకు అడ్డాగా మారింది.

పెంకి అప్పారావు, సీఐటీయూ మండలాధ్యక్షుడు, ఆకివీడు

బస్సులు పాయింట్‌లోకి వెళ్లడం లేదు



ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు బస్టాండ్ పాయింట్‌లోకి వెళ్ళకుండా వెళ్లిపోవడంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌లో నుంచి బస్సు దగ్గరకు వచ్చేసరికి బస్సు వెళ్ళిపోతుంది. బస్టాండ్ కూర్చోలేకపోతున్నాం. దుర్వాసన వస్తున్నది. బస్టాండ్‌ను అభివృద్ధి చేయాలి.

బేతా శ్రీను, ప్రయాణికుడు, ఆకివీడు



ఇసుక తిన్నెల్లో చలువ పందిళ్ళు



ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు

శరవేగంగా పట్టిసీమలో శివరాత్రి ఏర్పాట్లు

పోలవరం,ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. శుక్రవారం నాటికి ఇసుక తిన్నెల్లో చలువ పందిళ్ళు, ఇసుక తిన్నెల్లో వీఐపీ కాలిబాట, ఆలయ ఆవరణ, ఆలయం చుట్టూ, లోపల భక్తుల రాకపోకల కోసం క్యూలైన్లు బారికేడ్లు, క్యూలైన్లలో ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఇసుక తిన్నెల్లో బట్టలు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. నదిపై రాకపోకలు సాగించేందుకు ఏర్పాటు చేస్తున్న నడక మార్గం వద్ద ఇసుక డ్రెజ్జింగ్ పనులు వేగవంతంగా చేశారు. సుమారు 150 మీటర్ల మేర ఇసుక డ్రెజ్జింగ్ పనులు పూర్తి చేసి కర్రలు తడికలతో నడక మార్గం ఏర్పాటు చేశారు. ఫెర్రీ రేవుల్లో టికెట్ కౌంటర్లు, వివిధ ప్రభుత్వ శాఖల సమాచార సేవాకౌంటర్లు, ఇసుక తిన్నెల్లో వైద్య శిబిరాల కౌంటర్లు ఇప్పటికే నిర్మాణం పూర్తి చేశారు. ఇసుక తిన్నెల్లో భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్ళ నిర్మాణం పూర్తి చేశారు. నది దాటిన తర్వాత ఇసుక తిన్నెలకు చేరుకోవడానికి అడ్డుగా ఉన్న మరో నీటి పాయపై ఇసుక డ్రెజ్జింగ్ చేసి తడికలు, కర్రలతో కాలిబాట ఏర్పాటు చేశారు. పట్టిసీమ ఏటిగట్టు పొడవున్నా కన్నాపురం అడ్డరోడ్డు వరకూ ఏటిగట్టుపై విద్యుత్ దీపాలంకరణ, విద్యుద్దీపాల ఏర్పాటు ఇప్పటికే పూర్తి చేశారు.నదిపై కాలినడక మార్గం నుండి ఆలయ ప్రాంగణం వరకూ భక్తులు సౌకర్యవంతంగా నడిచేందుకు గోనె సంచులతో కాలిబాట ఏర్పాటు చేయవలసి ఉండగా గోనె సంచుల కొరత వలన సేకరణ జాప్యం వలన ఇంకా ప్రారంభించలేదు. ఆలయ ప్రాంగణం నుండి ఇసుకతిన్నెల వరకూ మంచినీటి ట్యాపుల ఏర్పాటు, చేతిపంపుల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.



భక్తులకు పూర్తిస్థాయి రక్షణ ఏర్పాట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు

ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి రక్షణ కల్పిస్తామని డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను జంగారెడ్డిగూడెం విద్యుత్ శాఖ డీఈ ఫీర్ మహ్మద్, సీఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ పవన్ కుమార్‌లతో కలిసి డీఎస్పీ పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో బారికేడింగ్, విద్యుత్ దీపాలంకరణ, మంచినీటి సౌకర్యాలు, నదీ తీరంలో మరుగుదొడ్లు, బట్టలు మార్చుకునే గదులు, చలువ పందిళ్ళు , కాలి నడక మార్గం ఏర్పాట్లు , నదిపై డ్రెజ్జింగ్ పనులు, ఇసుక తిన్నెల్లో వాచ్ టవర్ల ఏర్పాట్లను పరిశీలించారు. ఫెర్రీ ప్రాంతం నుంచి ఆలయ ప్రాంగణం వరకూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రణాళికా బద్ధంగా రక్షణ చర్యలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. భక్తులు పోలీసులకు ఇతర శాఖల అధికారులకు సహకరించాలని కోరారు. విద్యుత్ శాఖ డీఈ మాట్లాడుతూ విద్యుత్ టవర్ నుంచి వచ్చిన 11 కెవి వైర్లకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ సరఫరాకి అంతరాయం లేకుండా ప్రమాదరహితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు, సిబ్బంది వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

కలవపూడిలో వైభవంగా శివాలయ ప్రతిష్ఠ

కాళ్ళ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) ఓం నమః శివాయ హర..హర..మహాదేవా!! అంటూ కలవపూడి గ్రామం శుక్రవారం శివనామస్మరణతో మారుమోగింది. కాళ్ళ మండలం కలవపూడి గ్రామంలో దశాబ్దాల చరిత్ర కలిగిన ఉమాభీమేశ్వరస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్థులు పూనుకున్నారు. రెండు వారాలుగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహిస్తున్నారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో నూతన విగ్రహాలు, ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. నూతన విగ్రహాలకు వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి,ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు, జనసేన ఉండి ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, తదితరులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు.



శివుని విగ్రహాన్ని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే శివరామరాజు



ధ్వజస్తంభం ప్రతిష్ఠ

సుందరగిరిపై నేత్రపర్వంగా లక్షమోదక హోమం

26న సుదర్శన నృశింహమహాయజ్ఞం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సుందరగిరిపై స్వయంవ్యక్తునిగా కొలువుదీరిన లక్ష్మీనారసింహుని ఆలయంలో అతిరుద్ర ప్రయోగ సహిత సుదర్శన నృశింహ మహాయజ్ఞం నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.ప్రతీ ఏటా మహాశివరాత్రి పర్వ దినాన ఈ యజ్ఞనిర్వహణ జరుగుతుంది. శుక్ర వారం ఉదయం ఆలయ యాగశాలలో ప్రధాన యజ్ఞా ప్రారంభానికి సూచికగా మహా గణపతి లక్షమోదక హోమాన్ని వేదపండితులు, రుత్వికులు వేదమంత్రోచ్ఛరణల నడుమ నేత్రపర్వంగా జరిపారు. హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట నరసింహగురూజీ ఆధ్వర్యంలో కుటుంబరావు పర్యవేక్షణలో ఈ యాగాన్ని నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే ఉత్సవాల్లో భాగంగా ఈనెల 23న అంకురార్పణ, ధ్వజారోహణ, కలశస్థాపన, 24న మూల వరులకు అభిషేకం, నవనృశింహ హోమం, 25న మహాగణపతి హోమం, 26న సూర్య నమస్కారాలు, మహాలింగార్చన, అతి రుద్రప్రయోగ సహిత సుదర్శన నృశింహ మహాయజ్ఞం, 27న మహాశాంతి కల్యాణం జరగుతుందని నరసింహగురూజీ తెలిపారు. ఆలయ యాగశాల, పరిసరాలను సుందరీ కరించారు. అనంతరం సాయంత్రం వరకూ నిర్విరామంగా లక్షమోదక హోమాన్ని జరిపారు.



మూలవిరాట్‌కు పూజలు చేస్తున్న పండితులు



పదిలో 530 మార్కులు వస్తే రూ.25 వేలు

పెదపాలపర్రు హైస్కూల్ విద్యార్థులకు తెలుగు టీచర్ ప్రోత్సాహం



ముదినేపల్లి, ఫిబ్ర వరి 21 (ఆంధ్ర జ్యోతి): ముదినేపల్లి మండలం పెద పాల పర్రు గ్రామంలోని ఈదర శోభనాద్రి చౌదరి మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు ఆ హైస్కూలు తెలుగు పండిట్ బి.శిరీష కుమారి భారీ నజరానా ప్రకటించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 600 మార్కు లకు 530 మార్కులు సాధించిన ప్రతీ విద్యార్థికి రూ.25 వేలు నగదు అవార్డు ప్రకటించారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జరిగిన సభలో ఆమె బహుమతులను ప్రకటించారు. టీచర్ శిరీషను రిటైర్డ్ డీవైఈవో వెంకటేశ్వర రావు, హెచ్ఎం పాండురంగారావు, టీచర్లు అభినందించారు.

హెచ్‌ఎంలు లేకపోతే ఎలా?

'పది' ఫార్మేటివ్ పరీక్షల ఫలితాలపై సమీక్ష వాయిదా

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన ఫార్మేటివ్ (ఎఫ్-3) పరీక్షల ఫలితాలపై పాఠశాలల వారీగా హైస్కూల్ హెచ్‌ఎంలతో సమీక్షించేందుకు శుక్రవారం జరగాల్సిన సమావేశం అర్థంతరంగా వాయిదా పడింది. ఈ సమావేశం ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి అధ్యక్షతన జరగాల్సి ఉంది. మండలాల వారీగా హైస్కూల్ హెచ్‌ఎంలు ఎంఈవో కార్యాలయాలకు ఉదయం 11 గంటలకల్లా చేరుకుని జూమ్ విధానంలో జరిగే సమీక్షకు అందుబాటులో ఉండాలని తొలుత సమాచారం పంపించారు. ఆ తర్వాత ఈ సమావేశాన్ని మధ్యాహ్నం 3 గంటలకు, మళ్లీ 4 గంటలకు ప్రారంభమవుతుందని సమాచారం ఇచ్చారు. కాగా ఉదయం 11 గంటల నుంచే ఎంఈవో కార్యాలయాలకు చేరుకున్న హెచ్‌ఎంలు మధ్యాహ్నం 3 గంటలు దాటుతున్నా సమావేశం ప్రారంభం కాకపోవడం, అసలు జరుగుతుందా, లేదా అనే సందిగ్ధతకు గురై తమతమ స్కూళ్ళకు వెళ్లిపోయారు. ఎట్టకేలకు సాయంత్రం సమావేశం ప్రారంభం కాగా, తొలుత ఎంఈవోలతో సంభాషించడానికి కలెక్టర్ ప్రయత్నించగా, కొందరు ఎంఈవోలు సెలవులో ఉండటం, మరికొందరు సరిగా రెస్పాండ్ కాకపోవడంతో పాటు, మండల స్థాయిలో హెచ్‌ఎంలు అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ వెట్రిసెల్వి ఒకింత అసహనానికి గురైనట్టు తెలిసింది. ఈ క్రమంలోనే డీఈవో వెంకటలక్ష్మమ్మను హెచ్‌ఎంలు సమావేశానికి అందుబాటులో లేకపోవడాన్ని ప్రశ్నించినట్టు సమాచారం. మరో 3 రోజుల్లో టెన్త్ ప్రీఫైనల్ పరీక్షల ఫలితాలపై సమీక్షిస్తానని, పూర్తి సమాచారంతో అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించినట్టు తెలిసింది.


కళాశాలల యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ ప్రసన్నశ్రీ

కళాశాలల్లో ఫేర్‌వెల్ పార్టీలు నిషేధించండి

నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : కళాశాలల్లో ఫంక్షన్లు, ఫేర్‌వెల్ పార్టీలు, డీజేలు వంటి నృత్య ప్రదర్శనలు నిషేధించాలని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ఆదేశించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాల్స్ శుక్రవారం నన్నయ వర్సిటీ నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆమెను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ కార్యక్రమమైనా సాంప్రదాయబద్ధంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలోనే ఎక్కువ అనుబంధ కళాశాలలు నన్నయ వర్సిటీలో ఉన్నాయన్నారు. 390 అనుబంధ కళాశాలల్లో లక్షకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. అన్ని కళాశాలల్లో పరీక్షలు సక్రమంగా జరిగేందుకు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరా మోనటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. దానిని విశ్వవిద్యాలయం నుంచి అధికారులు పరిశీలిస్తారని చెప్పారు. దీని ద్వారా ఆయా కళాశాలల్లో పరీక్ష నిర్వహణ, పర్యవేక్షణ సులభతరం అవుతుందని పేర్కొన్నారు. వీటిని ఏర్పాటు చేయవలసిన బాధ్యత ఆయా కళాశాలలపై ఉందని చెప్పారు. పూర్తిస్థాయిలో అన్ని కళాశాలల్లో తరగతులు నిర్వహించాలని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్యజి.సుధాకర్, సీడీసీ డీన్ కె.శ్రీరమేష్, పరీక్షల డీన్ డి.కళ్యాణి పాల్గొన్నారు


ఎన్నికల పరిశీలకులు సీహెచ్ శ్రీధర్‌తో సమావేశమైన కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై పరిశీలకుడి ఆరా

ఏలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తూర్పు- పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులుగా సీహెచ్ శ్రీధర్ నియమితులయ్యారు. గతంలో నియమితులైన కె సునీత స్థానంలో ఈయన శుక్రవారం ఏలూరు జిల్లాకు రాగా, జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి సీహెచ్ శ్రీధర్‌కు పూలమొక్క ఇచ్చి స్వాగతం పలికారు. ఆయన ఎన్నికల నిర్వహణపై ఆరా తీశారు. పోలింగ్ ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నెల మొదట విడత శిక్షణ పూర్తి చేశామని, రెండో విడత కింద ఈ నెల 22న ఉదయం 10 గంటలకు గోదావరి సమావేశమందిరంలో పీవో, ఏపీవోలకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెట్రిసెల్వి వివరించారు. ఓటర్ స్లిప్‌ల పంపిణీ కూడా చేపట్టామని, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లను తెలిపారు. 456 పోలింగ్ కేంద్రాలకు 1199 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశామని, ఏలూరు జిల్లాలో 66 పోలింగ్ కేంద్రాలకు 217 బ్యాలెట్ బాక్సులను సిద్ధంగా ఉంచామన్నారు. జాయింట్ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి, డీఆర్వో వి. విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పంపిణీ కేంద్రాలు ఇవే...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ కమ్ ఇంటర్‌మీడియేటరీ, స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి కె వెట్రిసెల్వి ఒక ప్రకటనలో వెల్లడించారు.

- కాకినాడ జిల్లాకు కాకినాడలోని ఎంసీ లారిన్ హైస్కూల్, పెద్దాపురం ఆర్డీవో కార్యాల యం.
- అల్లూరి జిల్లాకు రంపచోడవరం సబ్ కలెక్టరేట్, చింతూరు సబ్ కలెక్టరేట్
- అంబేద్కర్ కోనసీమకు అమలాపురానికి అగ్రహారంలోని వీఎస్ఎం ఇంజనీరింగ్ కళాశాల, కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల.
- పశ్చిమగోదావరి జిల్లాకు భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాల యాలు
- తూర్పుగోదావరి జిల్లాకు రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల.
- ఏలూరు జిల్లాకు ఏలూరు కలెక్టరేట్‌లోని గిరిజన భవన్, జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయా ల్లోను ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా ఎన్నికల పోలింగ్ సామగ్రిని ఎన్నికల సిబ్బందికి అందజేస్తామన్నారు. పోలింగ్ అనం తరం బ్యాలెట్‌లను ఆయా జిల్లాల్లోని రిసెప్షన్ కౌంటర్లకు చేర్చి అక్కడ నుంచి ఇంటర్‌మీడి యేటరీ స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఏలూరు జిల్లా వట్లూరులోని సర్ సీఆర్‌ఆర్‌రెడ్డి కళాశాలలోని కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తామని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు.

పౌల్ట్రీ నిర్వహణ ఇలాగేనా ?

బాదంపూడిలో బర్డ్ ఫ్లూ సోకిన కోళ్ల ఫారాన్ని పరిశీలించి.. యజమానిపై మండిపడిన కేంద్ర బృందం


బాదంపూడి పౌల్ట్రీని శుభ్రపరుస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఉంగుటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం బాదంపూడిలోని బర్డ్ ఫ్లూ సోకిన వెంకట మణికంఠ కోళ్ల ఫారం నిర్వహణపై కేంద్ర బృందం మండిపడింది. పౌల్ట్రీని ఇలాగేనా నిర్వహించేది అని ప్రశ్నించారు. శుక్రవారం ఈ ఫారాన్ని పరిశీలించిన అధికారులు.. పౌల్ట్రీలో శుభ్రం చేస్తున్న వ్యక్తికి రక్షణకు సంబంధించిన మాస్క్, దుస్తులు లేకపోవడంపై యజమానిని నిలదీశారు. పౌల్ట్రీలోకి వచ్చే వారు చేతులను శుభ్రం చేసుకునేందుకు ఏర్పాటు చేసిన సదుపాయాలు సరిగా లేకపోవడంపై మండిపడ్డారు. కనీసం శానిటైజర్, సబ్బులు కూడా పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బర్డ్‌ఫ్లూ కారణంగా మృతి చెందిన కోళ్లను ఎలా పాతిపెట్టారని అడిగారు. మేత, గుడ్ల ఎగుమతి, నిల్వల స్టాకులపై ఆరా తీశారు. పౌల్ట్రీలో పనిచేసే వారి వివరాలు అడిగారు. వారికి ఏమైనా ఆరోగ్య సమస్యలు తలెత్తాయా అని ప్రశ్నించారు. పౌల్ట్రీలో మేత యంత్రం శుభ్రపరుస్తున్న తీరును, పౌల్ట్రీని, కోడి వ్యర్థాలను శుభ్రపరుస్తున్న కార్మికులతో మాట్లాడారు. బృందంలో కేంద్ర పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఆర్‌జీ బామ్‌బాల్, బెంగళూరులోని దక్షిణ భారత ప్రాంతీయ డిసీజ్ లేబొరేటరీ జేడీ రవీంద్ర హెగ్డే, ఐకార్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వెటర్నరీ సీనియర్ సైంటిస్టు ముదాసార్, భోపాల్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యానిమల్ డిసీజ్ శాస్త్రవేత్త డాక్టర్ మనోజ్‌కుమార్, గన్నవరం ఎన్టీఆర్ పశువైద్య శాఖ ప్రొఫెసర్ డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం, పశు సంవర్ధక శాఖ జేడీ టి.గోవిందరాజులు పాల్గొన్నారు.

మహిళల ఆందోళన

కోళ్ల ఫారం కారణంగా తాము ఇబ్బందులు పడుతున్నామని సమీపంలోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర బృందం పౌల్ట్రీ సమీపంలోని హైస్కూల్ ప్రాంతాన్ని పరిశీలించింది. వీరు వచ్చిన విషయాన్ని తెలుసుకుని మహిళలు అక్కడకు వచ్చారు. పౌల్ట్రీ వల్ల దుర్వాసనతోపాటు దోమలు అధికం అవుతున్నాయని, అనేకమంది జ్వరాల బారిన పడుతున్నారని వాపోయారు. ఇక్కడే హైస్కూలు ఉండడంతో కోళ్ల ఫారం నుంచి వచ్చే వ్యర్థాల వల్ల చెడు వాసనతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు.

పవర్‌పేట రైల్వే స్టేషన్‌లో ఏజెంట్లదే పవర్

» రిజర్వేషన్ టిక్కెట్లు సామాన్యులకు అందడం గగనమే » రైల్వే సిబ్బందిని ప్రసన్నం చేసుకుంటున్న ఏజెంట్లు? » సీసీ కెమేరాలు లేకపోవడంతో ఇష్టారాజ్యం » విస్మయం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు


పవర్‌పేట రైల్వే స్టేషన్ వద్ద రిజర్వేషన్ కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రయాణాలకు తక్కువ ఖర్చుతో సుఖవంతమైన ప్రయాణం చేయాలంటే రైలులోనే ప్రయాణిస్తారు. ముందుగా ప్రణాళిక ఉంటే ఏ రోజు ఊరు ప్రయాణం వెళ్ళేది ఖచ్చితంగా నిర్ణయించుకుని ముందుగానే టిక్కెట్లను రిజర్వేషన్ చేసుకుంటూ ఉంటారు. ఈ రిజర్వేషన్ గతంలో నాలుగు నెలలు ఉండగా ప్రస్తుతం దీనిని రెండు నెలలకు కుదించారు. ఒక వేళ వెయిటింగ్ లిస్టులో వచ్చినా అప్పటికి మనకు టిక్కెట్ వస్తుందని భావిస్తూ ఉంటారు. తప్పనిసరి పరిస్థితిలో టిక్కెట్ రాకపోయినా తత్కాల్ టిక్కెట్ అయి నా తీసుకోవడానికి సిద్ధమవుతారు. అత్యవస రంగా, అకస్మాత్తుగా ప్రయాణాన్ని కొనసాగిం చాలంటే వారు కూడా తత్కాల్ టిక్కెట్ కొనుగోలు చేసుకోవడానికి సిద్ధపడతారు. అ యితే ప్రయాణం కొనసాగించుకోవడానికి ఏలూరు పవర్‌పేట స్టేషన్‌కు టిక్కెట్ల కోసం వెళ్ళారంటే ఇక నరకం చూడాల్సిందే. రిజర్వే షన్ టిక్కెట్ పొందాలంటే అక్కడ ఏమి జరు గుతుందో తెలియని పరిస్థితి. పొరపాటున ఎవరైనా లైన్‌లో ఉండి అడిగినప్పటికి అక్కడ సిబ్బంది కసురుకోవడం చేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా తత్కాల్ టిక్కెట్లు రిజర్వేషన్ పొం దేవారు తాము ఎక్కవలసిన రైలు బయలు దేరిన ప్రాంతానికి ఒక్క రోజు ముందుగానే తత్కాల్ టిక్కెట్లు జారీ చేస్తుంటారు. ఏసీ టిక్కెట్లు అయితే ఉదయం 10 గంటల నుంచి ఇస్తారు. సెకండ్ క్లాస్ స్లీపరు 11 గంటల నుంచి ఇస్తారు. ఆ సమయంలో ఆ టిక్కెట్ల సైట్లు ఓపెన్ అవుతాయి. ఇవి రైల్వేకు సంబంధించిన ఆన్‌లైన్ సైట్‌లో కూడా టిక్కెట్లు పొందవచ్చు. కానీ ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ మాత్రం ఏలూరు నగరంలో ఉన్న కొంత మంది ఏజెంట్లు కోసమే అక్కడ రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేశారనే విమర్శలు వస్తున్నాయి. సీసీ కెమెరాలు లేకపోవడంతో ఏజెంట్లు ప్రతి రోజు వచ్చి తత్కాల్ టిక్కెట్‌లను పొందిన తరువాతే మిగిలిన వారికి టిక్కెట్లు తీసుకోవడానికి అవకాశం ఇస్తున్నారు.

ఇక్కడ కొంత మంది రైల్వే శాఖ ఉద్యోగులు ఏజెంట్లతో చేతులు కలిపి సామాన్య ప్రజలకు టిక్కెట్లు అందకుండా చేస్తున్నారని బహిరంగంగానే తెలుస్తుంది. ఆంధ్ర జ్యోతి కొద్ది రోజుల నుంచి పవర్‌పేట, పెద్ద రైల్వే స్టేషన్‌ను పరిశీలించగా పెద్ద రైల్వే స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఉండడంతో అక్కడకు తక్కువగా ఏజెంట్లు వస్తున్నారు. పవర్ పేట రైల్వే స్టేషన్ మాత్రం ఉదయం 10 గంటలకు ఏసీ తత్కాల్ టిక్కెట్లు జారీ చేసే సమయం, 11 గంటలకు స్లీపర్ క్లాస్ తత్కాల్ టిక్కెట్లు జారీ చేసే సమయాల్లో ఏజెంట్లు హవా అంతా ఇంతా కాదు. ఎవరైనా తమ ప్రయాణం కోసం తత్కాల్ టిక్కెట్ కోసం వెళ్ళారంటే వారికి నిరాశ ఎదురవ్వక తప్పదు. ఈతతంగం అంతా రైల్వే అధికారులు చూసినా తమకు ఏమి తెలియనట్లుగా వ్యవహరించడం వెనుక గోప్యం ఏమిటో అంతుపట్టనిదిగా ఉంది. నిత్యం ఏజెంట్లు ఆ రైల్వే స్టేషన్ కౌంటర్లకు వస్తూ, టిక్కెట్లు కొనుగోలు చేస్తూ ఉన్నప్పటికీ కూడా ఒక్క రోజు కూడా వారిని ప్రశ్నించిన అధికారే లేడు. నిబంధనల ప్రకారం రిజ ర్వేషన్ ఫామ్స్ రాసి అక్కడ సీరియల్‌గా పెట్టే విధానం లేనప్పటికీ ఏజెంట్లు మాత్రం తమ సొంత నిర్ణయాలతో ఫామ్స్‌ను పూర్తి చేసి వారే సీరియల్ నెంబర్ వేసుకుని రిజర్వేషన్ కౌంటర్ వద్ద ముందు రోజు పెట్టేయడం చేస్తు న్నా ఇవేమి కనపడ నట్లుగా వ్యవహరిస్తున్నారంటే వారిని ఏజెంట్లు ప్రసన్నం చేసుకున్నారో ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది. ఇలాంటి ఏజెంట్లను నివారించడానికి జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు ఉన్నా ఒక్కసారి కూడా ఈ స్టేషన్లకు సంబంధిత పోలీసులు వచ్చిన దాఖలాలే లేవు. దీంతో ఏజంట్ల వ్యాపారం వర్ధిల్లుతుంది. ఇప్పటికైనా రైల్వేలోని నిఘా విభాగాలు దృష్టి పెట్టి ఏజెంట్లను నియంత్రించి సామాన్య ప్రయాణికులకు తత్కాల్ టిక్కెట్లు అందు బాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


సీరియల్ నెంబర్ వేసి పెట్టిన రిజర్వేషన్ ఫామ్స్

ముందే నంబర్లు వేస్తున్నారు..

రైల్వే నిబంధన ప్రకారం టికెట్ రిజర్వేషన్ చేయించుకునే వారు ఫామ్ పూర్తి చేసి ఆసమయంలో వరుసలో నిలబడి ఉండాలి. ఒక వ్యక్తికి ఒక ఫామ్ (ఆరుగురు ప్రయాణించే) రిజర్వేషన్ చేసుకునే వీలు ఉంది. ఇక్కడ మాత్రం ఏజెంట్లు ఒక రోజు ముందుగానే తమ ఫామ్స్‌ను ఏవో పేర్లతో పూర్తి చేసి రిజర్వేషన్ కౌంటర్ వద్ద ఒకటి రెండు మూడు అంటూ నెంబర్లు వేసి పెట్టేస్తుంటారు. ఆ తరువాత రిజర్వేషన్ సమయానికి తాము పూర్తి చేసుకు వచ్చిన ఫామ్స్‌ను ఆ సీరియల్ తమదే నంటూ వరుస పెట్టి ఇచ్చేస్తుంటారు. ఎవరైనా తత్కాల్ టిక్కెట్ కోసం రిజర్వేషన్‌కు వెళ్ళారంటే బిత్తరపోయి చూడాల్సిందే. రిజర్వేషన్ టిక్కెట్లు ఇచ్చే వారితో సరదా సంభాషణలు చేసుకోవడం, రాజకీయాలు మాట్లాడుకోవడం అక్కడ చూసే వారికి ఆశ్చర్యం కలగ మానదు. ఎవరైనా తాము ఎప్పుడో లైన్లో ఉన్నామని అడిగితే ఆ ఫామ్స్ సీరియల్‌లో ఉన్నవాటిని తాము తత్కాల్ టిక్కెట్లు జారీ చేస్తున్నామని చెప్తుంటారు.


ఇంటి యజమానులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

తాళం వేసిన ఇంటిని దోచారు

49 కాసుల బంగారం చోరీ

పెనుగొండ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఇంటికి తాళం వేసి షిర్డీ యాత్రకు వెళ్లి తిరిగి వచ్చే సరికి దొంగలు ఉన్నదంతా దోచుకెళ్ళారు. ఏకంగా 49 కాసుల బంగారు ఆభరణాలను దోచుకెళ్లిపోయారు. పెనుగొండ ఎంపీడీవో కార్యాలయం వెనుక నివాసం ఉంటున్న గుబ్బల లక్ష్మీనారాయణ ఈ నెల 17న షిర్డీ వెళ్ళారు. తిరిగి శుక్రవారం ఇంటికి చేరుకున్నారు. ఇంటి కి చేరుకునే సరికి బీరువా బద్దలు కొట్టి ఇంటిలోని సామగ్రి, బీరువాలోని సామాగ్రి చిందరవందరగా పడి ఉండటంతో హడలిపోయారు. బీరువాలో బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాయుడు విజయ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ కె. గంగాధర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం 49 కాసులు బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నరసాపురం డీఎస్పీ జి. శ్రీవేద చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు.

అక్రమార్జనకు నకిలీ నోట్లను ఎంచుకున్నారు..

తొమ్మిది మంది ముఠా అరెస్టు.. 352 నోట్లు, ప్రింటింగ్ మిషన్ స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అడ్డదారిలో డబ్బులు సంపాదించేందుకు దొంగనోట్ల ముద్రనే మేలని దొంగనోట్లు ప్రింట్ చేసి మారుస్తున్న ముఠాను తాడేపల్లిగూడెం పోలీసులు అరెస్ట్ చేసి వారినుంచి దొంగనోటట్లు, ప్రింటింగ్ మిషన్ స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ డి.విశ్వనాథ్ శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నాచుగుంటకు చెందిన పులపాక సాంబశివ అలియాస్ సాంబ కొంత మందితో కలిసి ముఠాగా ఏర్పడి దొంగనోట్లను మారుస్తున్నారు. ముఖ్యంగా పెట్రోల్ బంకులు, మద్యం దుకాణాల్లో దొంగనోట్లు మారుస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందడంతో పోలీసులు నిఘా పెట్టారు. ఈ నిఘాలో సాంబశివతోపాటు అంబేడ్కర్ కోనసీమజిల్లా ఆత్రేయపురానికి చెందిన వెలగదుర్తి జ్యోతి సాయి, చింతా వర ప్రసాద్, భీమవరం మండలం రాయలంకకు చెందిన ఏలూరి వెంకట సత్యనారాయణ, గోపాలపురం మండలం గోపవరంకు చెందిన పూలపల్లి చిన్నబాబు, దెందులూరు మండలం కొత్తగూడెంకు చెందిన కాళి సుబ్బరాజు, కృష్ణాజిల్లా బాపులపాడుకు చెందిన బొడ్డు శ్రీధర్, హనుమాన్ జంక్షన్‌కు చెందిన నల్ల ప్రసాద్, రాయవరంకు చెందిన వాసంశెట్టి రఘురాంలను అరెస్టు చేశారు. వారితో పాటు 352 నకిలీ 500 నోట్లు, కంప్యూటర్, ప్రింటర్, ప్రింటింగ్ సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ముఠాను పట్టుకున్న సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సై నాగరాజు, బాదం శ్రీను, సిబ్బందిని అభినందించారు.

దొంగ నోట్ల ముద్రణకు చైనా సామగ్రి

» కలర్స్ సెక్యూరిటీ పేపర్‌ల దిగుమతి » ఢిల్లీ కస్టమ్స్ అధికారుల అలర్ట్‌తో గుట్టురట్టు » నరసాపురానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ ఖాన్ అరెస్టు » సెక్యూరిటీ పేపర్‌లు, ప్రింటర్‌ల స్వాధీనం


నిందితుడిని అరెస్టు చేసి విలేకరులకు వివరాలు చెబుతున్న సీఐ యాదగిరి

నరసాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చైనా నుంచి కలర్ సెక్యూరిటీ పేపర్స్ దిగుమతి చేసుకుని ఆధునిక ప్రింటర్‌లు, స్కానర్‌ల సహాయంతో దొంగ నోట్లు ముద్రించేందుకు ప్రయత్నించిన మహ్మద్ ఇస్మాయిల్ ఖాన్‌ను అరెస్ట్ చేసినట్టు నరసాపురం టౌన్ సీఐ యాదగిరి తెలిపారు. శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్ ఖాన్ సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆశతో దొంగ నోట్లు ముంద్రించి చెలామణి చేయాలని యోచించాడు. ఇందుకు ఆలీబాబా వెబ్‌సైట్ ద్వారా చైనా నుంచి సెక్యూరిటీ కలర్ పేపర్‌లను రప్పించాడు. నోట్లు ముద్రణకు ఆధునిక టెక్నాలజీతో ఉండే ప్రింటర్, స్కానర్‌ను కొనుగోలు చేశాడు. గుట్టుగా కొంత పేపర్‌ను వినియోగించి రూ.500 నోట్లను ముద్రించాడు. అయితే ఆనోట్లు సక్రమంగా రాకపోవడంతో పేపర్‌లో లోపం ఉందని వాటన్నింటిని చించివేశాడు. అయితే నిందితుడు ఆలీబాబా వెబ్‌సైట్ ద్వారా సెక్యూరిటీ పేపర్‌ను దిగుమతి చేసుకున్న విషయాన్ని ఢిల్లీ కస్టమ్స్ అధికారుల నోటీసుకు వచ్చింది. వెంటనే ఢిల్లీ అధికారులు విజయవాడ కస్టమ్స్ అధికారులను అలర్ట్ చేశారు. సీనియర్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారి నాగభూషణం ఆధ్వర్యంలో ఒక బృందం నరసాపురం వచ్చి పోలీసుల సహాయంతో నిందితుడు గృహంలో సోదాలు జరిపారు. ప్రింటింగ్ సామగ్రితోపాటు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసకుని నిందితుడుని అరెస్ట్ చేసినట్టు సీఐ యాదగిరి తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ముత్యాల రావు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

1,13,683 బర్డ్ ఫ్లూ కోళ్లు, 1,63,780 గుడ్లు ఖననం

ఉంగుటూరు, ఫిబ్రవరి 21: ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామంలో వెంకట మణికంఠ పౌల్ట్రీస్‌లో 20 రెస్క్యూ రెస్పాన్స్ టీంలు ఈ నెల 13 నుంచి శుక్రవారం వరకు పనిచేస్తున్నాయని ఇన్‌చార్జి జే.డి.టి.గోవిందరాజు తెలిపారు.బర్డ్ ఫ్లూ వ్యాధి సోకిన ప్రాంతంలో లక్షా 13,683 కోళ్లను ఖననం చేశామని వివరించారు. ఇదే సందర్భంలో లక్షా 63,780 కోడి గుడ్లను స్థానిక పౌల్ట్రీలో పాతి పెట్టామని తెలిపారు. మేతకు సంబంధించి సుమారు లక్షా 79,840 కిలోల దాణాను ఖననం చేశామని తెలిపారు.



కారు నడుపుతుండగా ఫిట్స్ తప్పిన ప్రమాదం

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కారు నడుపుతున్న వ్యక్తికి అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో కారు అదుపు తప్పి పార్కింగ్ చేసిఉన్న మోటారు సైకిళ్లను ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు మోటారు సైకిళ్ల పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఒక వ్యాగనార్ కారు శుక్ర వారం మధ్యాహ్నం ఫైర్ స్టేషన్ వైపు నుంచి ఓవర్ బ్రిడ్జి కింద వెళుతుండగా ఒక రెస్టారెంట్ ఎదురుగా పార్కు చేసిఉన్న మోటారు సైకిళ్లను ఆ కారు ఢీ కొంది. అయితే కారు నడిపే వ్యక్తికి ఫిట్స్ రావడంతో నెమ్మదిగా వెళ్తున్న ఆ కారు మోటారు సైకిల్‌ను ఢీకొని ఇంజన్ ఆగిపో యింది. ఆ కారు నడుపుతున్న వ్యక్తి తల స్టీరి ంగ్‌కు తగలడంతో దెబ్బతగిలింది. అక్కడ ఉన్న వారంతా వారిద్దరిని బయటకు తీసి ప్రాథమికంగా సపర్యలు చేశారు. అనంతరం ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పాక్షికంగా దెబ్బతిన్న వాహనాలకు తాము సొమ్ములు చెల్లిస్తామని ఆ కారుగల వారు చెప్పడంతో ఎలాంటి ఫిర్యాదు లేకుండా వెళ్ళిపోయారు. మధ్యాహ్నం కావడంతో అక్కడ ఎవ్వరు జనం లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లు అయింది.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

ఇద్దరు దొంగల అరెస్ట్ రూ. 1.80 లక్షల సొత్తు స్వాధీనం


నిందితుల్ని అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జయసూర్య

భీమవరం క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు భీమవరం డీఎస్పీ ఆర్‌జి జయసూర్య శుక్రవారం తెలిపారు. భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇటీవల భీమవరం మెంటేవారి తోటకు చెందిన ఆంజనేయస్వామి అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి ఊరు వెళ్ళారు. తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు బద్ధలుకొట్టి ఉన్నాయి. బీరువాలో ఉన్న సుమారు 26 గ్రాముల బంగారు, 450 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో ఆంజనేయస్వామి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ నాగరాజు, ఎస్ఐ కిరణ్ కుమార్‌లు సిబ్బందిచే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో మెంటేవారి తోట బైపాస్ రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానంగా కనిపించడంతో వారిని అరెస్ట్ చేశారు. విచారణ చేయగా వారిద్దరు ఆంజనేయస్వామి నివాసంలో దొంగతనాలకు పాల్పడినట్లుగా తేలడంతో వారి వద్ద 26 గ్రాముల బంగారు వస్తువులు, 450 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లిగూడెం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసుకు సంబంధించి 28 గ్రాముల బంగారు వస్తువులు కూడా స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. తాడేపల్లిగూడెం, భీమవరంలలో దొంగతనాలు రెండు కలిపి రూ.1.80 లక్షల సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడినవారు తణుకు ఇందిరమ్మ కాలనీకి చెందిన నగరపు ఈశ్వరరావు (శింగపూడి ఈశ్వరరావు), అలాగే తణుకు పాతూరు గ్రామానికి చెందిన తండాసి కామేశ్వరరావులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈశ్వరరావుపై గతంలో రాజోలు, ఉండ్రాజవరం, అమలాపురం, ఇరగవరం, పెనుమంట్ర తదితర పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నట్లుగా తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీసీఎస్ సీఐ రాంబాబు, వన్‌టౌన్ సీఐ నాగరాజు, ఎస్ఐ కిరణ్‌కుమార్, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

కాంట్రాక్టు ఉద్యోగి అనుమానాస్పద మృతి

భీమడోలు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రిలో అదే గ్రామానికి చెందిన కాంట్రాక్టు ఉద్యోగిగా పని చేస్తున్న తల్లిబోయిన పరమేశ్వరరావు(33) రక్త పరీక్షా కేంద్రంలో మృతి చెంది ఉండగా శుక్రవారం సాయంత్రం ఆసుపత్రి సిబ్బంది గుర్తించి పోలీసు వారికి సమాచారం ఇచ్చారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని భీమడోలు పోలీసులు తెలిపారు.

చాక్లెట్లు తిన్న విద్యార్థినులకు అస్వస్థత

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి):చాక్లెట్లు తిని విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన నూజివీడు మండలం సుంకొల్లు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. సుంకొల్లు ఎంపీపీ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎ.రిషిత, ఎ.నిషిత, కె.రేష్మి, జి.లక్ష్మి, ఎస్.వైష్ణవిలు పాఠశాల సమీపంలో గల కిరాణా కొట్టులో చాక్లెట్లను తీసుకున్నారు. అనంతరం విద్యార్థినిలు కడుపు నొప్పికి గురై అస్వస్థతకు గురవ్వడంతో గమనించిన పాఠశాల సిబ్బంది నూజివీడు ఏరియాఆసుపత్రికి తరలించారు. విద్యార్థినిల ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.


చికిత్సపొందుతున్న విద్యార్థినులు

గ్రూప్-2 పరీక్షార్థులకు హెల్ప్‌లైన్ కేంద్రం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష ఆదివారం జరుగనుంది. నిర్వహణపై జేసీ ధాత్రిరెడ్డి వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పరీక్షార్థులకోసం కలెక్టరేట్‌లో 99122 44293, 80085 39786 నెంబర్లతో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ట్రాఫిక్ అడ్డంకులు లేకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు, లైజన్ అధికారులు, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ కాంప్లెక్స్‌లకు నిధులు విడుదల

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్సుల స్థానే ఏర్పాటుచేసిన క్లస్టర్ కాంప్లెక్సులకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఒక్కో క్లస్టర్‌కు రూ. లక్ష చొప్పున జిల్లాలో మొత్తం 111 క్లస్టర్లకు నిధులను విడుదల చేశారు. ఈ నిధులతో క్లస్టర్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలతో ప్రతీ నెలా నిర్వహించే సమావేశాల నిర్వహణకు, అల్పాహారం, తదితర ఖర్చులతోపాటు, క్లస్టర్ హెచ్‌ఎం తన పరిధిలోని పాఠశాలల సందర్శనకు వెళ్లేందుకు రవాణాభత్యం ఖర్చులకు వినియోగించుకోవచ్చు.


ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ప్రభాకర్

ప్రతి సమస్యను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వివిధ సమస్యలపై పలువురు వినతులు అందించారు. వారి సమస్యలను విన్న ప్రభాకర్ సమస్యల పరిష్కారానికి అనువుగా చర్యలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో వచ్చిన ప్రతి ఒక్కరి నమ్మకానికి అనుగుణంగా పనిచేస్తారనన్నారు. కొన్ని సమస్యల పరిష్కారంలో కొంచెం ఆలస్యమైనా సమస్య పరిష్కారమే అంతిమమని ఆయన పేర్కొన్నారు.

రెండు పూటలా తాగునీరందిస్తాం : ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు వేసవిలో రెండు పూటలా తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ సిబ్బందితో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. దెందులూరు వద్ద 110ఎకరాల్లో తాగునీటి చెరువు కొత్త మోటర్లను వినియోగంలోకి తెచ్చామన్నారు. రాబోయే పది రోజుల్లో గోదావరి కాల్వ నీటితో చెరువును నింపుతామన్నారు. ట్యాంక్‌లో నాచు తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీరు వృథా చేయవద్దని ప్రజలకు హితవుపలికారు. ఏఈ సాంబశివరావు, డీఈలు రజక్, కొండలరావు, తాతబ్బాయి, అజయ్, ఏఈ సాయి, అరుణ్‌దేవ్, సంధ్య, పాల్గొన్నారు.

లారీల సమస్య పరిష్కారం

చింతలపూడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆంజనేయ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చింతలపూడి, లింగపాలెం ఏరియాల్లో మొక్కజొన్న రవాణా కాంట్రాక్టర్లు బయట లారీలను తెప్పించుకోవడం వలన స్థానిక లారీలు నష్టపోతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే కాంట్రాక్టర్లతో చర్చించి సమస్య పరిష్కరించారు. ఈ ప్రాంత లారీలను రవాణాకు వినియోగించుకుంటున్నారని ఎమ్మెల్యేకు అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్వాడీల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

వేలేరుపాడు, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): తక్కువ వేతనా లతో విధులు నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తల సమ స్యలను పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీ కార్యకర్తలు ఏఐటీయూసీ సభ్యులు శుక్రవారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసి వినతి పత్రం ఇచ్చారు. కౌలూరి సైదా, చందా రమాదేవి, పత్రా లీలావతి, ఈ.వెంక టేశ్వరి, నిర్మల, తదితరులు ఎమ్మెల్యేకు సమస్యలు వివరించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

రామవరం గ్రామ పరిధిలో అభివృద్ధి పనులకు నిధుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పిట్టా ప్రసాద్ ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బుచ్చిబాబు, కారం దారయ్య, బాడిత రాము, బందం అర్జున్, తదితరులు ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీని వాస డాంగే, జోనల్ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు ఆధ్వర్యంలో ఆర్ఆర్‌పేట సర్వీస్ రిజర్వాయర్ సెంటర్ వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. యూనియన్ నాయకులు బి.నారాయణరావు, డి.వెంకటేశ్వరరావు, నారా శ్రీను, ఎస్.సింహాచలం, కందుల శ్రీనివాస్, దుర్గారావు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ ఏర్పాటుకు డ్రైవర్ల ఆందోళన

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్ల వెంబడి ఉన్న ఆటోలను మున్సిపల్ సిబ్బంది తొలగిస్తున్నారని, ఎక్కడ ఉంచాలని ఆటోడ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఖాళీ ప్రదేశంలో 300మంది ఆటోడ్రైవర్లు ఆటోలు నిలుపుతున్నారన్నారు. వాటిని తొలగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆటోడ్రైవర్ల జీవనోపాధిని దెబ్బతిస్తున్నారని నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సోమయ్య మాట్లాడుతూ నగరంలో 6వేల మంది ఆటోడ్రైవర్లు జీవనోపాధి పొందుతున్నారన్నారు. ఆటోస్టాండ్ ఏర్పాటుచేసి వారి జీవనానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాజారావు, సుందరరావు, వైష్ణవ్, ప్రసాద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానం లేకుండా చికెన్ తినండి : వ్యాపారులు

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమానాలకు తావులేకుండా చికెన్ తినవచ్చని వ్యాపారులు అన్నారు. నగరంలో చికెన్ వ్యాపారులు, ఫారమ్ యాజమానులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పలువురు వ్యాపారస్థులు మాట్లాడుతూ చికెన్ తింటే ప్రజలకు బర్డ్‌ఫ్లూ రాదని పలు ప్రభుత్వ నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. చికెన్, గుడ్లను 70డిగ్రీల ఫారెన్‌హీట్ వేడిలో ఉడకబెట్టుకుని తినవచ్చని నిపుణులు చెప్పారన్నారు. ఈ నెల 23న ఏఎస్ఆర్ స్టేడియంలో చికెన్ మేళా నిర్వహిస్తామన్నారు. చికెన్ మేళాకు రావాలని ర్యాలీగా వెళ్లి జాయింట్ కలెక్టర్‌ను ఆహ్వానించారు.

పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలి

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బర్డ్‌ఫ్లూ వలన నష్టపోయిన పౌల్ట్రీ రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు కె.శ్రీనివాస్ కోరారు. అన్నేభవనంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పౌల్ట్రీ రైతులు, కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించి పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

గంగానమ్మ జాతర, శివరాత్రికి ప్రత్యేక బస్సులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పండుగల సందర్భంగా ఏలూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డీఎం బి.వాణి తెలిపారు. పెదవేగి మండలం కూచింపూడిలో ఈనెల 23, 24 తేదీలలో జరిగే గంగానమ్మ జాతర సందర్భంగా ఏలూరు నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈనెల 26న శివరాత్రిని పురస్కరించుకుని ఏలూరు నుంచి బలివేకి 25 నుంచి 27 మధ్యాహ్నం వరకూ మహా శివరాత్రి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. తాడేపల్లిగూడెం సమీపంలోని వీరంపాలెంలో స్ఫటిక లింగ దర్శనం నిమిత్తం 26 ఉదయం నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. శ్రీశైలం మహాక్షేత్రానికి ప్రతిరోజు రాత్రి 9 గంటలకు ఏలూరు నుంచి ఒక ప్రత్యేక బస్సును నడపడం జరుగుతుందన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై కార్యదర్శులకు శిక్షణ

ఉంగుటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఘన వ్యర్థాల నిర్వహణపై డీపీవో కె.అనూరాధ కార్యదర్శులకు శుక్రవారం శిక్షణ నిచ్చారు. అన్ని గ్రామ పంచాయితీలు వీధులను శుభ్రపరచడంతో పాటు బ్లీచింగ్, మంచినీటి క్లోరినేషన్ నిర్వహించాలన్నారు. ఎంపీడీవో రాజ్ మనోజ్, డీపీఆర్సీ సమన్వయకర్త ప్రసంగిరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.రామారావు, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండలంలోని కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

బోధనతోపాటు పిల్లల ఆరోగ్యం ఎంతో ముఖ్యం

పెదవేగి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పిల్లలకు విద్యతో పాటు వారి ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలని జిల్లా ప్రథమ్ కోఆర్డినేటర్ టి.శ్రీనివాస్ అన్నారు. పెదవేగిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. 4, 5 ఏళ్ళ చిన్నారుల పూర్వ ప్రాథమిక విద్య పుస్తకాలను పరిశీలించారు. చేశారు. తల్లులతో మాట్లాడి, పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై చర్చించారు.



పామాయిల్‌కు దక్కని ధర

● గ్రేడింగ్ పేరుతో ధరలో కోత ● నష్టాల బాటలో రైతులు

లింగపాలెం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలో పామాయిల్ సాగు విస్తరించింది. గిట్టుబాటు ధర దక్కకపోవడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. మండలంలో ఇప్పటికే 11వేల ఎకరాలలో పామాయిల్ తోటలు ఉండగా ప్రభుత్వ ప్రోత్సాహంతో సాగు విస్తరిస్తుందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నా గెలల ధర రైతులను భయపెడుతోంది. వరి, మొక్క జొన్నతో పోల్చితే పామాయిల్ సాగుతో లాభాలు బాగుంటాయని భావించిన రైతులను ధర తీవ్ర నిరాశకు గురిచేసింది. గత ఏడాది పామాయిల్ గెలల టన్ను ధర 23వేలు కాగా ఈ ఏడాది ఒక్కసారిగా రూ. 13 వేలకు పడిపోయింది. ప్రభుత్వం పామాయిల్ సాగును ప్రోత్సహిస్తున్నా మద్దతు ధర ప్రకటించడంలో చొరవ చూపడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పామాయిల్ గెలల ధరల పతనాన్ని ఆపక పోతే నష్టాలలో కూరుకుపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొక్క నాటిన నాలుగేళ్ల వరకూ ఆదాయం లేక పోయినా పెట్టుబడి పెట్టాల్సిందేనన్నారు. తీరా దిగుబడి వచ్చేసరికి ధర తగ్గిపోవడంతో రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. సాగు చేపట్టిన నాటి నుంచి గెలలను ఫ్యాక్టరీలకు తరలించేవరకు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని రైతులు చెబుతున్నారు. ఒకపక్క కూలీల కొరత, వారికి అధిక మొత్తం చెల్లింపు భారమవుతుందన్నారు. గెలలు కోసి ఫ్యాక్టరీలకు తరలిస్తే కంపెనీలు నాణ్యత, నూనె దిగుబడి పేరుతో గ్రేడింగ్ చేసి సగం గెలలను పక్కన పడవేస్తున్నారని, ధరలో కోత విధిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

పామాయిల్ రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం



మండలంలో పామాయిల్ సాగు విస్తరిస్తోంది. రైతులకు ప్రభుత్వం ఒక్కో మొక్క కొనుగోలులో రూ.193 సబ్సిడీ అందిస్తుంది. వాటితో పాటు మొక్కలు నాటిన ఐదేళ్ల వరకు పంటల నిర్వహణకు ఖర్చులకు రైతులకు ప్రభుత్వం ద్వారా సంవత్సరానికి రూ.5,250 రూపాయలు అందిస్తున్నాం. వీటితోపాటు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా డ్రిప్ పైపులు 90శాతం సబ్సిడీపై అందిస్తున్నాం. రైతుల పక్షాన ధరల స్థిరీకరణకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తాం.

- షాఫియా పర్వీన్, ఉద్యానశాఖ అధికారి

తగ్గిన ధర.. పెట్టుబడి భారం



రెండెన్నర ఎకరాలలో పామాయిల్ పంట వేశాను. పామాయిల్ గెలల ధర గతేడాది 23వేలు ఉండగా ఈ ఏడాది 13వేలకు పడిపోయింది. పంట నాటిన నాలుగేళ్ల వరకూ ఆదాయం ఉండదు అయినా పెట్టుబడులు పెట్టి తోటలను పెంచుకున్నాం. తీరా పంట చేతికి వచ్చాక పామాయిల్ ధరలు తగ్గిపోవడంతో ఏంచెయ్యాలో పాలు పోవడంలేదు. పామాయిల్ రైతులమందరం తీవ్రంగానష్టపోతున్నాం. టన్నుకు రూ.19 వేల నుంచి రూ. 21 వేల కనీస మద్దతు ధర ఉంటే బాగుంటుంది.

- తాతిన రామారావు, పామాయిల్ రైతు, సింగగూడెం





తెలుగు కవులు, భాషా ప్రాశస్త్యంపై ఏలూరులో విద్యార్థుల ప్రదర్శన, పెదపాడు హైస్కూల్‌లో భాషోత్సవం, పంగిడిగూడెం పాఠశాల విద్యార్థుల ప్రదర్శన

మాతృభాషతోనే మెరుగైన ఫలితాలు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు విద్యాసంస్థల్లో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సీఆర్ఆర్ కళాశాలలో 'నూతన విద్యా విధానంలో మాతృభాష బోధన' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో వేదాంతం విష్ణు ప్రసాద్, వై.ఆనందనాయుడు మాట్లాడుతూ ఎనిమిదేళ్ల లోపు విద్యార్థులు మాతృభాషలో విద్యనభ్యసిస్తే మెరుగైన ఫలితాలను పొందవచ్చన్నారు. కరస్పాండెంట్ విష్ణు మోహన్, ప్రిన్సిపాల్ రామరాజు, తెలుగుశాఖాధిపతి మేడసాని శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ బోధన, అభ్యసనానికి మాతృభాషకు మించిన సాధనం లేదన్నారు. తెలుగు అధ్యాపకుడు ఎస్.పరమేశ, లేళ్ళ వెంకటేశ్వరరావు, రాంబాబు, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఇందిరా కాలనీ పాఠశాల విద్యార్థులు తెలుగుతల్లి వేషధారణలో అలరించారు. సంతోషీనగర్ శర్వాణి స్కూలు విద్యార్థుల నృత్యప్రదర్శనలు, గీతాలాపన, తెలుగు అచ్చులతో పదాలు, శతక పద్యాలు, యక్ష ప్రశ్నలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

● చింతలపూడి: రాఘవాపురం పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డి.రాజబాబు విద్యార్థులతో శ్లోకాలు, పద్యాలు, కథలు, కవితలు, వ్యాసాలు, హాస్య నినాదాలు, నీతి వాక్యాలు వల్లె వేయించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు సురేష్, కమలరత్నం, వనజ, రవిచంద్రపాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర కుమార్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

● పెదపాడు: విద్యార్థులు మాట్లాడడం, రాయడం, చదవడం, వినడం, సాధన ద్వారా భాషపై పట్టు సాధించవచ్చని హైస్కూల్ హెచ్‌ఎం పి.వెంకటేశ్వరరావు అన్నారు. ఆంగ్ల, సంస్కృత, హిందీ, గిరిజన, తెలుగు భాషలపై నిర్వహించిన ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

● పోలవరం: పోలవరం, నూతనగూడెం, బీసీ కాలనీ, కృష్ణారావుపేట, బంగారమ్మపేట, పట్టిసీమ, కొత్త పట్టిసీమ, గూటాల పాఠశాలల్లో మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆకుల నరసింహమూర్తి మాట్లాడుతూ ఆది గురువు అమ్మ అన్నారు. కార్యక్రమంలో కొమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, వెంకటరెడ్డిగూడెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: పంగిడిగూడెం జడ్పీ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించారు. వ్యాసరచన, పద్యాలు, వక్తృత్వంపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం పి.సురేష్, తెలుగుపండిట్ మద్దాల పెద్దిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: మాతృభాషను ప్రతిఒక్కరూ గౌరవించుకోవాలని వైఎంహెచ్ఏ ప్రతినిధులు అన్నారు. తెలుగుతల్లి విగ్రహానికి అంబికా రాజా, వై.సోమలింగేశ్వరావు, ఎల్.వెంకటేశ్వరరావు తదితరులు పూలమాల వేశారు. యిరదల ముద్దుకృష్ణ, వేమా కోటేశ్వరరావు, కేబీ రావు, ఏ.పార్వతి రామచంద్రన్, గరికపాటి కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలోని అన్ని పాఠశాలల్లో మాతృ భాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు మా తెలుగుతల్లికి మల్లెపూ దండ శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శించారు. విద్యార్థులకు వ్యాసరచన, పద్యరచన, తెలుగు సామెతల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు.

నేటి నుంచి నాటిక పోటీలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గరికపాటి ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీల్లో ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో జాతీయస్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు గరికపాటి కాళిదాసు శుక్రవారం తెలిపారు. 22న అనూహ్యం, మరీ అంతవద్దు, 23న నేనేం చేసుకుంటాను, సారీ రాంగ్ నంబర్, ఎడారిలో వాన చినుకు, నాటికలు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఎస్.వి రామారావు, యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, ప్రముఖులు హాజరవుతారని కాళిదాసు తెలిపారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జోన్ క్రీడా పోటీలు ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పరుగుపందెం, షాట్‌పుట్, డిస్కస్ త్రో పోటీలు నిర్వహించారు. జోన్ కోఆర్డినేటర్ ఐ.రమేష్, వివిధ పాఠశాలలకు చెందిన పి.డిలు, పీఈటీలు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే దోమల వ్యాప్తిని అరికట్ట వచ్చని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ప్రసాద్ అన్నారు. కొత్తపేట, దాసరి ఎర్రయ్యవీధి, తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే ర్యాలీ నిర్వహించారు. మురుగు కాల్వల్లో చెత్త వేయరాదని, ఆహారం తీసుకునేముందు, తీసుకున్న తర్వాత తప్పనిసరిగా చేతులను సబ్బునీటితో కడుక్కోవాలని సూచించారు. పవర్‌పేట అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి గౌతమ్, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వైద్య ఉద్యోగుల సొసైటీ సమావేశం

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 23న జరగనుంది. ఏలూరు రైల్వేస్టేషన్ రోడ్డులోని సొసైటీ నూతన కార్యాలయంలో సమావేశం జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు వడ్డి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. సంఘ సభ్యులు హాజరుకావాలన్నారు.

కంప్యూటర్ టాలీపై ఉచిత శిక్షణ

పెదపాడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో టాలీపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు శుక్రవారం తెలిపారు. మార్చి 13 నుంచి నెలరోజుల పాటు శిక్షణ ఉంటుందని, 10వ తరగతి పాసై 45 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 9502723561, 9014040780 నెంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

ఎయిడ్స్ నియంత్రణపై ప్రచారం

ఉంగుటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురు, శుక్రవారాలలో హైరిస్క్ ప్రాంతాలలో మొబైల్ వ్యాన్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎయిడ్స్ నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శిరీష, కౌన్సిలర్ సురేష్, ల్యాబ్ టెక్నీషియన్ హనుమంతు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. ఇద్దరు గర్భిణులు, పలువురు పేషెంట్లను పరీక్షించి మందులు అందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించాలి

పట్టభద్రులను కలిసిన నేతలు



పట్టభద్రుల ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు, గన్ని, అంగర, ఏలూరులో ఎమ్మెల్యే చంటి, మేయర్ ప్రచారం

ఉంగుటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కోరారు. కాగుపాడు గ్రామంలో కడియాల రవిశంకర్ నేతృత్వంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, నియోజకవర్గ పరిశీలకుడు వీఎస్ఎస్.సత్యనారాయణ మూర్తి యాదవ్, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ కాగుపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి, సిబ్బందిని కలిసి కరపత్రాలు అందించి ఓట్లను అభ్యర్థించారు. కూటమి నాయకులు వీర, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: కూటమి ప్రభుత్వానికి పట్టభద్రులంతా అండగా నిలవాలని ఎమ్మెల్యే బడేటి చంటి, టీడీపీ పరిశీలకురాలు ఆచంట సునీత కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయం కోరుతూ నగరపాలక సంస్థ, పలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రచారం నిర్వహించారు. మేయర్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు: రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిని రాజ శేఖరంను గెలిపించాలని మండ లంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఉద్యోగులంతా దీనిని గుర్తించి కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమం లో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: పట్టణం లో కోర్టు వద్ద కూటమి నాయకులు లాయర్లను కలిసి రాజశేఖరంను గెలిపించాలని కోరారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం, గురుకు ల పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ, జూని యర్ కళాశాలలో గ్రాడ్యుయేట్‌లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. దాసరి శ్యామ్ చంద్రశేషు, రావూరి కృష్ణ, పారేపల్లి రామారావు, మండవ లక్ష్మ ణరావు, పరిమి సత్తిపండు, ఈడా శ్రీనివాస్, నంబూరి రామచంద్రరాజు, రామలింగేశ్వరరావు, బొబ్బర రాజ్‌పా ల్ కుమార్, రాజాన పండు, పాతూరి అంబేడ్కర్, చేను ప్రసాద్, తెలగారపు జ్యోతి, మారిశెట్టి బాల చిట్టెమ్మ, జి.శ్రీదేవి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రాజశేఖరం విజయం కోరుతూ కూటమి నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. కుక్కునూరు, కివ్వాక, మారేబాక గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, పిచ్చుక రాజు, పులి శ్రీను, మరణరాజు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగంధర్, ఎం.వెంకన్నబాబు, మంత్రి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: నగరంలోని పలు డివిజన్‌లలో జనసేన నాయకులు విస్తృతప్రచారం నిర్వహించారు. నాయకులు నగిరెడ్డి కాశీనరేష్, రెడ్డిగౌరీశంకర్, జనసేన నాయకులు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్య ఓటు పేరాబత్తుల రాజశేఖరానికి వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎస్.రాజేష్, వై.ధర్మేంద్ర, నాయకులు వీరంకి పండు, వి.రామునాయుడు, జనసేన కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను గెలిపించాలని టీడీపీ మండల అధ్యక్షుడు గరిమెళ్ళ చలపతిరావు కోరారు. మండలంలో కూటమి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. తాతిన రాధాకృష్ణ, బొంతు రాంబాబు, గారపాటి బుజ్జియ్య, మోరంపూడి వరప్రసాద్, బొల్లిన పుల్లారావు, పల్లి శ్రీను, నాగబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గుంతలు లేని నగరంగా తీర్చిదిద్దుతాం

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): గుంతలు లేని నగరంగా ఏలూరును తీర్చిదిద్దుతామని కమిషనర్ ఏ.భానుప్రతాప్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ. 40లక్షలతో నగరంలో 900గోతుల రోడ్లు పూడ్చామన్నారు. ఆర్ఆర్.పేట, వన్‌టౌన్‌లో రూ.కోటితో నూతన రోడ్లు నిర్మించామన్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.3కోట్లతో అభివృద్ధి పనులు త్వరలో చేపడతామన్నారు. వేసవిలో రెండు పూటల తాగునీరు అందిస్తామన్నారు. ప్రజలు పన్ను చెల్లింపులు చేసి నగరాభివృద్ధికి సహకరించాలన్నారు.


పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంకట్రాజు

అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠ

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఐఎస్ రాఘవాపురం పంచాయితీ తూర్ల లక్ష్మీపురంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్వామి వారికి పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు లంకా సత్యనారాయణ, పోలిన శ్రీను, రేగంటి రాంబాబు, జె.సిద్ధారావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతరు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయం వద్ద వ్యాపారులు నిబంధనలు బేఖాతరు చేసి పూజా సామగ్రి అధిక ధరకు విక్రయిస్తున్నారు. అగరబత్తి దుకాణంలో నిబంధనలకు విరుద్ధంగా పూజా సామగ్రి విక్రయించడంపై శుక్రవారం వివాదం నెలకొంది. తణుకుకు చెందిన బి.లోకేశ్ అగరబత్తి దుకాణంలో ఆవు నెయ్యి ప్యాకెట్, కుంకుమ డబ్బా కొనుగోలు చేసాడు. రూ.50 కుంకుమ డబ్బా రూ.80కు విక్రయించడంతో లోకేశ్ నిలదీశాడు. ఆ దుకాణంలో అగరబత్తి మినహా నెయ్యి, పసుపు, కుంకుమ విక్రయించ రాదని సమాచారం.

అంబికాదేవి ఆలయ వార్షికోత్సవం

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని అంబికాదేవి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, అంబికా ప్రసాద్, అంబికా రాజా దంపతులు, కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కుల గణన చేయాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కులాలవారీగా జనాభా లెక్క లు తేల్చాలని సాహితివేత్త, బహుజన మేధావి లంకా వెంకటేశ్వర్లు అన్నారు. ఏపీ బీసీ కులాల జేఏసీ వార్షికోత్సవం శుక్రవారం జరిగింది. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీసీ జనాభాను బట్టి రాజకీయ రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రొఫెసర్ కంచె ఐలయ్య మాట్లాడుతూ బహుజనులు జాతీయ పారిశ్రామిక వేత్తలుగా మారినప్పుడే ఈ దేశంలో రాజ్యాధికారం వస్తుందన్నారు. రీడ్, రైట్, ఫైట్ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవరకొండ వెంకటేశ్వర్లు, షేక్ ముస్తఫా ఆలీ, గురుప్రసాద్, బేతాళ సుదర్శన్, లెనిన్ తదితరులు ప్రసంగించారు.

నిరుద్యోగ భృతి ఇవ్వని ప్రభుత్వం

పోలవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల్లో ఏ ఒక్కరికీ నిరుద్యోగ భృతి ఇవ్వలేకపోయిందని మాజీ ఎంపీ జీవీ.హర్షకుమార్ విమర్శించారు. శుక్రవారం పట్టిసీమలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సూపర్ సిక్స్ అమలు చేయలేకపోయారన్నారు. టీడీపీ కార్యాలయంపై దాడులకు పాల్పడిన వారిని బయటకు తీసి కేసులు పెట్టడం తప్ప సంపద సృష్టించలేక పోయారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో జీవీ సుందర్‌ను గెలిపించాలని కోరారు. సొబ్బన మోహన్, ఈర్నాల జాన్ బాబు, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఆటో ధ్వంసం

భీమడోలు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): భీమడోలు సంత మార్కెట్‌కు చెందిన నిమ్మగడ్డ మణి కుమార్ ట్రక్కు ఆటోను గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన కోనా అశోక్ కుమార్ ధ్వంసం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మణికుమార్ కుమారుడు, అశోక్ కుమార్ మధ్య వ్యక్తిగత విబేధాలున్నాయి. గురువారం రాత్రి మణి కుమార్ ఆటోను పెట్రోలు పోసి తగులబెట్టినట్లు ఫిర్యాదు చేయడంతో కోనా అశోక్ కుమార్‌పై కేసు నమోదు చేశారు.

ఆవు దూడల అక్రమ తరలింపు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.నాగులపల్లి అడ్డరోడ్డు వద్ద 50 ఆవుదూడలను తరలిస్తున్న కంటైనర్‌ను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు ఆవు దూడలను తరలిస్తున్నారని సమాచారం అందడంతో ద్వారకాతిరుమల పోలీసులు కాపు కాచి దానిని పట్టుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

బీసీ కార్పొరేషన్ ఈడీని కలిసిన నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

కలిదిండి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కలిదిండికి చెందిన నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు సంఘ నాయకులు శుక్రవారం ఏలూరులో బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలతను కలసి బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు మంజూరు, ఆదరణ పథకం పెండింగ్ తదితర విషయాలు చర్చించారు. ఆమె సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పలువురు నాయి బ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కోడిగుడ్డు ధర పతనం..

ముదినేపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి ప్రభావం కోడి గుడ్డు అమ్మకాలపై, ధరపై పడింది. వ్యాధి సోకక ముందు ఒక్కో గుడ్డు ధర ముదినేపల్లి ప్రాంతంలో రూ.5.75 ఉండగా రెండు రోజులుగా రూ.4.60కి పడిపోయింది. కోడిగుడ్ల వాడకం తగ్గటంతో అమ్మకాలు లేక గుడ్లు నిల్వ ఉంటే పాడై పోయే పరిస్థితి ఉండటంతో వ్యాపారులు నష్టం వస్తున్నా ధర తగ్గించి అమ్ముతున్నారు. కొనుగోలు చేసిన ధర కంటే తక్కువ ధరకు అమ్మడం ఇదే తొలిసారి అని ఒక వ్యాపారి తెలిపారు.

'పది'లో 530 మార్కులు సాధించండి..
రూ.25 వేలు బహుమతి పొందండి

విద్యార్థులకు పెదపాలపర్రు హైస్కూల్ తెలుగు టీచర్ ప్రోత్సాహం

ముదినేపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెదపాలపర్రులోని ఈదర శోభనాద్రి చౌదరి మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూలు పదో తరగతి విద్యార్థులకు ఆ హైస్కూలు తెలుగు పండిట్ బి.శిరీష కుమారి నజరానా ప్రకటించారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులకు 530 మార్కులు సాధించిన ప్రతీ విద్యార్థికి రూ.25 వేలు నగదు అవార్డు ప్రకటించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆ హైస్కూల్‌లో జరిగిన సభలో ఆమె ఉత్తమ విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతిని ప్రకటించారు. ఆమెను రిటైర్డ్ డీవై ఈవో గన్నమనేని వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం పి.పాండురంగారావు, ఉపాధ్యాయులు అభినందించారు.


తెలుగు పండిట్ శిరీష కుమారి

పవర్‌పేట రైల్వే స్టేషన్‌లో
ఏజెంట్లదే పవర్

- రిజర్వేషన్ టిక్కెట్లు సామాన్యులకు అందడం గగనమే
- రైల్వే సిబ్బందిని ప్రసన్నం చేసుకుంటున్న ఏజెంట్లు?


పవర్‌పేట రైల్వే స్టేషన్ వద్ద రిజర్వేషన్ కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి): సుదూర ప్రయాణాలకు తక్కువ ఖర్చుతో సుఖవంతమైన ప్రయాణం చేయాలంటే రైలులోనే ప్రయాణిస్తారు. ముందుగా ప్రణాళిక ఉంటే ఏ రోజు ఊరు ప్రయాణం వెళ్ళేది ఖచ్చితంగా నిర్ణయిం చుకుని ముందుగానే టిక్కెట్లను రిజర్వేషన్ చేసుకుంటూ ఉంటారు. ఈ రిజర్వేషన్ గతం లో నాలుగు నెలలు ఉండగా ప్రస్తుతం దీనిని రెండు నెలలకు కుదించారు. ఒక వేళ వెయిటింగ్ లిస్టులో వచ్చినా అప్పటికి మనకు టిక్కెట్ వస్తుందని భావిస్తూ ఉంటారు. తప్పనిసరి పరిస్థితిలో టిక్కెట్ రాకపోయినా తత్కాల్ టిక్కెట్ అయినా తీసుకోవడానికి సిద్ధమవుతారు. అత్యవసరంగా, అకస్మాత్తుగా ప్రయాణాన్ని కొనసాగించాలంటే వారు కూడా తత్కాల్ టిక్కెట్ కొనుగోలు చేసుకోవడానికి సిద్ధపడతారు. అయితే ప్రయాణం కొనసాగించుకోవడానికి ఏలూరు పవర్‌పేట స్టేషన్‌కు టిక్కెట్లు కోసం వెళ్ళారంటే ఇక నరకం చూడాల్సిందే. రిజర్వేషన్ టిక్కెట్ పొందాలంటే అక్కడ ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి. పొరపాటున ఎవరైనా లైన్‌లో ఉండి అడిగినప్పటికి అక్కడ సిబ్బంది కసురుకోవడం చేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా తత్కాల్ టిక్కెట్లు రిజర్వేషన్ పొందేవారు తాము ఎక్కవలసిన రైలు బయలుదేరిన ప్రాంతానికి ఒక్క రోజు ముందుగానే తత్కాల్ టిక్కెట్లు జారీ చేస్తుంటారు. ఏసీ టిక్కెట్లు అయితే ఉదయం 10 గంటల నుంచి ఇస్తారు. సెకండ్ క్లాస్ స్లీపరు 11 గంటల నుంచి ఇస్తారు. ఆ సమయంలో ఆ టిక్కెట్ల సైట్లు ఓపెన్ అవుతాయి. ఇవి రైల్వేకు సంబంధించిన ఆన్‌లైన్ సైట్‌లో కూడా టిక్కెట్లు పొందవచ్చు. కానీ ఏలూరు వపర్‌పేట రైల్వే స్టేషన్ మాత్రం ఏలూరు నగరంలో ఉన్న కొంత మంది ఏజెంట్లు కోసమే అక్కడ రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేశారనే విమర్శలు వస్తున్నాయి. సీసీ కెమెరాలు లేకపోవడంతో ఏజెంట్లు ప్రతి రోజు వచ్చి తత్కాల్ టిక్కెట్‌లను పొందిన తరువాతే మిగిలిన వారికి టిక్కెట్లు తీసుకోవడానికి అవకాశం ఇస్తున్నారు.

ఇక్కడ కొంత మంది రైల్వే శాఖ ఉద్యోగులు ఏజెంట్లతో చేతులు కలిపి సామాన్య ప్రజలకు టిక్కెట్లు అందకుండా చేస్తున్నారని బహిరంగంగానే తెలు స్తుంది. ఆంధ్ర జ్యోతి కొద్ది రోజుల నుంచి పవర్‌పేట, పెద్ద రైల్వే స్టేష న్‌ను పరిశీలించగా పెద్ద రైల్వే స్టేష న్‌లో సీసీ కెమెరాలు ఉండడంతో అక్కడకు తక్కువగా ఏజెంట్లు వస్తు న్నారు. పవర్ పేట రైల్వే స్టేషన్ మాత్రం ఉదయం 10 గంటలకు ఏసీ తత్కాల్ టిక్కెట్లు జారీ చేసే సమయం, 11 గంటలకు స్లీపర్ క్లాస్ తత్కాల్ టిక్కెట్లు జారీ చేసే సమయాల్లో ఏజెంట్లు హవా అంతా ఇంతా కాదు. ఎవరైనా తమ ప్రయాణం కోసం తత్కాల్ టిక్కెట్ కోసం వెళ్ళారంటే వారికి నిరాశ ఎదురవ్వక తప్పదు. ఈతతంగం అంతా రైల్వే అధికారులు చూసినా తమకు ఏమి తెలియనట్లుగా వ్యవహరించడం వెనుక గోప్యం ఏమిటో అంతు పట్టనిదిగా ఉంది. నిత్యం ఏజెంట్లు ఆ రైల్వే స్టేషన్ కౌంటర్లకు వస్తూ, టిక్కెట్లు కొనుగోలు చేస్తూ ఉన్నప్పటికీ కూడా ఒక్క రోజు కూడా వారిని ప్రశ్నించిన అధికారే లేడు. ఇలాంటి ఏజెంట్లను నివారించడానికి జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు ఉన్నా ఒక్కసారి కూడా ఈ స్టేషన్లకు సంబంధిత పోలీసులు వచ్చిన దాఖలాలే లేవు. ఇప్పటికైనా రైల్వేలోని నిఘా విభాగాలు దృష్టి పెట్టి ఏజెంట్లను నియం త్రించి సామాన్య ప్రయాణి కులకు తత్కాల్ టిక్కెట్లు అందు బాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ముందే నంబర్లు వేస్తున్నారు..


రైల్వే నిబంధన ప్రకారం టికెట్ రిజర్వేషన్ చేయించుకునే వారు ఫామ్ పూర్తి చేసి ఆ సమయంలో వరుసలో నిలబడి ఉండాలి. ఒక వ్యక్తికి ఒక ఫామ్ (ఆరుగురు ప్రయాణించే) రిజర్వేషన్ చేసుకునే వీలు ఉంది. ఇక్కడ మాత్రం ఏజెంట్లు ఒక రోజు ముందు గానే తమ ఫామ్స్‌ను ఏవో పేర్లతో పూర్తి చేసి రిజర్వేషన్ కౌంటర్ వద్ద ఒకటి రెండు మూడు అంటూ నెంబర్లు వేసి పెట్టేస్తుంటారు. ఆ తరువాత రిజర్వేషన్ సమయానికి తాము పూర్తి చేసుకు వచ్చిన ఫామ్స్‌ను ఆ సీరియల్ తమదే నంటూ వరుస పెట్టి ఇచ్చే స్తుంటారు. ఎవరైనా తత్కాల్ టిక్కెట్ కోసం రిజర్వేషన్‌కు వెళ్ళారంటే బిత్తరపోయి చూడాల్సిందే. రిజర్వేషన్ టిక్కెట్లు ఇచ్చే వారితో సరదా సంభాషణలు చేసుకోవడం, రాజకీయాలు మాట్లాడుకోవడం అక్కడ చూసే వారికి ఆశ్చర్యం కలగ మానదు. ఎవరైనా తాము ఎప్పుడో లైన్లో ఉన్నామని అడిగితే ఆ ఫామ్స్ సీరియల్‌లో ఉన్నవాటిని తాము తత్కాల్ టిక్కెట్లు జారీ చేస్తున్నామని చెప్తుంటారు.

సబ్‌జోనల్ క్రీడలు ప్రారంభం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గస్థాయి సబ్ జోనల్ బాలబాలికల క్రీడలను ఆగిరిపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో రాష్ట్ర గృహనిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ఈ పోటీల్లో వాలీబాల్ విన్నర్స్ కుమార్ స్కూల్, రన్నర్స్ యస్.ఆర్.ఆర్ స్కూల్ నూజివీడు, త్రోబాల్ విన్నర్స్ యనమదల, రన్నర్స్ మర్లపాలెం జిల్లాపరిషత్ హైస్కూల్, ఖోఖో విన్నర్స్‌గా సిద్ధార్థ చిన్నంపేట, రన్నర్స్ త్రివిధ స్కూల్ నూజివీడు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు సర్వేశ్వరరావు, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

చాక్లెట్ తిని విద్యార్థినులకు అస్వస్థత

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చాక్లెట్లు తిని విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన నూజివీడు మండలం సుంకొల్లు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. సుంకొల్లు ఎంపీపీ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎ.రిషిత, ఎ.నిషిత, కె.రేష్మి, జి.లక్ష్మీ, ఎస్.వైష్ణవిలు పాఠశాల సమీపంలో గల కిరాణా కొట్టులో చాక్లెట్లను తీసుకున్నారు. అనంతరం విద్యార్థినిలు కడుపునొప్పికి గురై అస్వస్థతకు గురవ్వడంతో గమనించిన పాఠశాల సిబ్బంది నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థినిల ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.


అస్వస్థతకు గురైన విద్యార్థినులు

బలివే మహాశివరాత్రి ఉత్సవ భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

ముసునూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బలివే రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలకు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ డి.ఎల్.వి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన బలివే ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తమ్మిలేరులో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించే స్నాన ఘాట్‌లతో పాటు జల్లుల స్నానాలు, దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్లు, లడ్డూప్రసాదాల తయారీ తదితర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తనిఖీదారు కె.అనురాధ, ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య పాల్గొన్నారు.

ఇల్లు దగ్ధం

ముసునూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వేల్పుచర్ల గ్రామంలో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైంది. చెరుకు తేరేజెమ్మకు చెందిన ఇంట్లో ఉన్న విలువైన సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. మంటలను నూజివీడు ఫైర్‌సిబ్బంది అదుపులోకి తీసుకు వచ్చారు. గ్రామవీఆర్వో నవీన్‌కుమార్ సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి సుమారు రూ.50వేలు ఆస్తినష్టం వాటిల్లినట్లుగా ప్రాథమిక నివేదికను తయారుచేసి తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ అందచేశారు.

పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు


ఆలయం వద్ద వేసిన చలువ పందిళ్లు


నీటితో నింపిన కోనేరు

కలిదిండి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శివ రాత్రి పురస్కరించుకుని కలిదిండి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాల ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయంలో చలువ పందిళ్లు వేశారు. ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించారు. పుణ్య స్నానాలు ఆచరించే పంచ బుగ్గల కోనేరును తాజా నీటితో నింపారు. మహిళలకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. స్వామి తెప్పో త్సవం నిర్వహించే తపస్సు చెరు వును శుభ్రపర్చారు. ఈనెల 24 నుంచి స్వామి కల్యాణోత్సవా లు ప్రారంభమవుతాయని ఈవో శేఖర్ తెలిపారు.


బొమ్మినంపాడులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నరసింహారావు


బూరుగుగూడెంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

'కూటమి అభ్యర్థి ఆలపాటికి మద్దతివ్వండి'

ముదినేపల్లి/చాట్రాయి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి అభ్యర్థి ఎన్నికల్లో ఎన్‌డిఏ కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి కూటమి ప్రభుత్వానికి మద్దతునివ్వాలని తెలుగుదేశం పార్టీ కైకలూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు కోరారు. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు, సూర్యనారాయణ పురం, పెదగొన్నూరు, వడాలి తదితర గ్రామాల్లో శుక్రవారం టీడీపీ, జనసేన నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు యర్రా రాంబాబు, నీటి సంఘం అధ్యక్షుడు కేసం ప్రసాద్, టీడీపీ జనసేన నాయకులు కోట జగన్, బాసినశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ చాట్రాయి మండలంలోని బూరుగుగూడెం, చిన్నంపేట, పోతనపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం కూటమి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు, కూటమి నాయకులు కాలసాని సూర్యనారాయణ, గోవర్ధనరెడ్డి, తేళ్ళూరి శేఖర్, వంగాల మాధవరెడ్డి, జయప్రకాష్, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా బాలికల సబ్‌జోన్ ఆటల పోటీలు


ముదినేపల్లి హైస్కూలులో బాలికల సబ్‌జోన్ ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో నరేశ్‌కుమార్, డీసీ వైస్ చైర్మన్ పేర్నిడు

ముదినేపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కైకలూరు నియోజకవర్గ స్థాయి సబ్ జోన్ ఆటల పోటీలు శుక్రవారం ముదినేపల్లి జడ్పీ హైస్కూలు ఆవరణలో కోలాహలంగా జరిగాయి. నియోజకవర్గంలోని 23 పాఠశాలలకు చెందిన 350 మంది బాలికలు పాల్గొన్నారు. ఎంఈవో నరేశ్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. ముదినేపల్లి హైస్కూలు పీడీలు కోడే రోజా, పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఖోఖోలో అల్లూరు, లోకుమూడిగరువు, కబడ్డీలో లోకుమూడిగరువు, అల్లూరు, వాలీబాల్‌లో భాస్కరరావు పేట, ముదినేపల్లి, త్రోబాల్‌లో అల్లూరు, పెదలంక జడ్పీ హైస్కూళ్ల విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. అథ్లెటిక్స్ విభాగంలో 100 మంది పాల్గొనగా 18 మంది బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు ఏఎస్ఐ శ్రీనివాస్, డీసీ వైస్ చైర్మన్ హనుమార పేర్నిడు, ఎస్ఎంసీ చైర్మన్ గాలిబాబు, హెచ్‌ఎం విజయ్ కుమార్, వైష్ణవి బహుమతులను అందజేశారు.


మంత్రి పార్థసారథితో చిన్నంపేట విజేతలు

క్రీడల్లో చిన్నంపేట విద్యార్థుల ప్రతిభ

చాట్రాయి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలో శుక్రవారం జరిగిన ఒకటవ గ్రిగ్ మెమోరియల్ నూజివీడు సబ్ జోన్ ఆటల పోటీలలో చిన్నంపేట సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి మంత్రి పార్థసారథిచే ప్రశంసలు అందుకున్నారు. ఖోఖోలో ఈ పాఠశాల జట్టు విన్నర్‌గా నిలవగా, 400 మీటర్ల పరుగు పందెంలో ఈ పాఠశాల విద్యార్థి డొంకెన యశ్వంత్ 3వ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు తెలిపారు.

మంత్రిని కలిసిన టైలర్స్

నూజివీడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): టైలర్స్‌డే కార్యక్రమానికి హాజరు కావాలని టైలర్స్ అసోసియేషన్ నాయకులు మంత్రి సారథికి ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా టైలర్లకు కమ్యూనిటీహాల్ నిర్మాణానికి స్థలాన్ని ఇవ్వాల్సిందిగా సారథికి విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్.డి రఫీ, సెక్రటరీ షేక్ షబీర్, దాసిరెడ్డి అనిల్‌కుమార్, శ్రీనివాసులు, యాసిన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణపై అవగాహన

చాట్రాయి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని, అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై రామకృష్ణ కోరారు. మహిళలు, బాలికలు, వృద్ధుల సంరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, తీసుకుంటున్న చర్యలపై అభయ మహిళా రక్షక దళ వాహనం ద్వారా శుక్రవారం మండలంలో ప్రచారం నిర్వహించారు. సహాయం కోసం టోల్‌ఫ్రీ నెంబర్లు 112 (అత్యవసర పరిస్థితులు), 1930 (సైబర్ నేరాలు), 1098 (బాల్య వివాహాలు), 9550351100 (అసాంఘిక కార్యకలాపాలు) లకు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్సై గజపతిరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180



నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475




కైకలూరులో వైవీఎన్నార్ కాలేజీలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీలత.. తుమ్మగూడెంలో మాతృభాషా దినోత్సవం

ఘనంగా మాతృభాషా దినోత్సవం

కైకలూరు/ముదినేపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాషకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించడం ద్వారా అనేకరంగాల్లో ఉపాధి పొందవచ్చని ప్రిన్సిపాల్ వై.శ్రీలత అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఉదయప్రకాష్, తెలుగు అధ్యాపకుడు డాక్టర్ అడపా కేదారి, చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ హరిప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు మన్నే శివనాగరాజు పాల్గొన్నారు. ముదినేపల్లి మండలం పెదపాలపర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా జరిగింది. హైస్కూలు హెచ్‌ఎం పంచిరెడ్డి పాండురంగారావు అధ్యక్షతన జరిగిన ఈ దినోత్సవంలో తెలుగు భాషపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన తెలుగు తల్లి బుర్ర కథ విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలుగు పండిట్ శిరీష కుమారి పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- చాట్రాయి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ భాషా దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం వెంకట్రావు మాట్లాడుతూ అమ్మభాష తెలుగును కాపాడుకోవటం మనందరి బాధ్యత అన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి


అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్

ముసునూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ముసునూరు జడ్పీ పాఠశాలలో 11,12 పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలు పరిష్కారంలో జాప్యం ఎందుకు అవుతుందని ఆయన అధికారులను ప్రశ్నించారు. తహసీల్దార్ కె. రాజ్‌కు మార్, వీఆర్వో మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

ముసునూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చెక్కపల్లి గ్రామంలో సారా స్థావరాలపై శుక్రవారం నూజివీడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 600 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసి పదిలీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య తెలిపారు. నిందితుడు తాళం మహేశ్వరరావు పరారీకాగా అతనిపై కేసునమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

జాయింట్ ఎల్‌పీల సమస్య పరిష్కరిస్తాం..


జేఎస్. సుభానీ, తహసీల్దార్

- **గతంలో మండలంలో డ్రోన్ రీసర్వే వల్ల జాయింట్ ఎల్‌పీలతో ఏర్పడిన సమస్యలకు పరిష్కారం ?**

జవాబు : తప్పకుండా పరిష్కరిస్తాం. జాయింట్ ఎల్‌పీల సమస్యలు లేకుండా సబ్ డివిజన్ చేస్తున్నాం.

- **డ్రోన్ సర్వే లోపభూయిష్టంగా జరిగిందనే విమర్శలున్నాయి ?**

జవాబు : అప్పట్లో డ్రోన్ సర్వే లోపభూయిష్టంగా జరిగినందుకే జాయింట్ ఎల్‌పీలు ఏర్పడ్డాయి.

- **ఆ భూములపై రుణాలు తీసుకోవడం, భూముల అమ్మకాలు, కొనుగోళ్లలో సమస్యలు తలెత్తాయి.**

జవాబు : వాస్తవమే. మండలంలోని పలువురు రైతులు సబ్ డివిజన్ల కోసం దాఖలు చేసిన అర్జీలను పరిశీలించి చర్యలు తీసుకున్నాం.

- **ఇటీవల మండలంలో నిర్వహించిన రీసర్వే గ్రామసభల్లో ఎన్ని అర్జీలు వచ్చాయి?**

జవాబు : గ్రామసభల్లో 320 అర్జీలు వచ్చాయి. 275 అర్జీలను పరిష్కరించాం.

- **పైలట్ ప్రాజెక్టు రీసర్వే ప్రక్రియ ఎంత వరకు జరిగింది?**

జవాబు : చినకామనపూడి గ్రామ ఏరియాలో పైలట్ ప్రాజెక్టు కింద 595 ఎకరాల్లో సర్వే నిర్వహించి ఇప్పటి వరకు 485 ఎకరాల్లో సరిహద్దులు నిర్వహించారు.

- ముదినేపల్లి


రైతులకు వివరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా

ప్రతీ రైతు విశిష్ట సంఖ్య గుర్తింపు కార్డు పొందాలి

కైకలూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలు రైతులకు అందాలంటే ప్రతీ రైతు 14 అంకెల విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా అన్నారు. ఆచవరంలో శుక్రవారం రైతులకు గుర్తింపు కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలో 1160 మంది రైతులు రిజిస్టరు చేసుకున్నట్టు తెలిపారు. ఏడీఏ గంగాధరరావు, ఏవో ఆర్.దివ్య, తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

కలిదిండి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం -గోపాలపురం రహదారి మరమ్మతులను టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, కూటమి నాయకులు శుక్రవారం పరిశీలించారు. రూ.60 లక్షలతో చేపట్టిన రోడ్డు మరమ్మతులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వెంకటాపురం సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు, కూటమి నాయకులు మేకా విజయ్, వాకాని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న మహిళలు

మహిళలపై దౌర్జన్యం

ముదినేపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పెయ్యేరు 'వి' కన్వెన్షన్ హాలుకు వెళ్లే రహదారిని బాగుచేస్తున్న ఇద్దరు మహిళలను సరిహద్దులో నివాసం ఉంటున్న ఇద్దరు దుర్భాషలాడి దౌర్జన్యం చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కన్వెన్షన్ హాలులో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన చుక్కా రాణి, నంకూరి జ్యోతి కొంతకాలంగా పని చేస్తున్నారు. శుక్రవారం ఉదయం హాలుకు వెళ్లే రహదారిని శుభ్రం చేస్తుండగా సత్యనారాయణ, సీతారామయ్య వచ్చి తమను పనిచేయకుండా దౌర్జన్యం చేసి కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇద్దరు మహిళలు గుడివాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

శ్మశానవాటిక శుభ్రం

కైకలూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్మశానవాటికలో దహన సంస్కారాలకు నిర్వహించుకునేందుకు అవకాశం లేకుండా తుమ్మచెట్లు, చెత్తాచెదారంతో పూడుకుపోవడంతో పంచాయతీ వార్డు సభ్యులు తొలగింపు పనులను చేపట్టారు. శుక్రవారం కైకలూరు శ్మశాన వాటికలో తుమ్మచెట్లను ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించారు. వార్డు సభ్యులు కేవీఎస్ఎం నాయుడు, మేడూరి నాంచారయ్య, మంచిగంటి శ్రీనివాసు, సమయం శ్రీను, బెల్లాని శ్రీనివాసరావు, అబ్దుల్ హమీద్, పి.శివరమ్య తదితరుల ఆధ్వర్యంలో పనులు నిర్వహించారు.